ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 25 2008



ఎవరెస్ట్ ఎక్కడం ఎంత కష్టమో !

హ్యాపీ బర్త్‌డే

(2008 మే-25 నుంచి-2008 మే-31వరకు)

ఎ. నేహ
9సం॥, మే-26
అనిత-యాదగిరి
అంబర్‌పేట్-హైదరాబాద్

బి. స్నేహ
8సం॥, మే-29
పద్మ-శంకర్
బర్లగూడెం-ఖమ్మం

బి.నిరోజ
6సం॥, మే-2002
పద్మ-శంకర్
బర్లగూడెం-ఖమ్మం

జ్ఞాన్ లక్కి
2సం॥, మే-30
సంధ్య-చరణ్
రాంనగర్-హైదరాబాద్

శ్రీచంద్
9సం॥, మే-1999
పార్వతి-శేషగిరి
విజయ్‌నగర్-ఖమ్మం

అశ్విని జయప్రకాష్
మే-27
సంధ్య-ఆంజనేయులు
పెద్దదర్పల్లి-మ॥నగర్

సిహెచ్. సందీప్
మే
కమల-శ్రీను
శాంతినగర్-విజయవాడ

పి. మనోజ్
1సం॥, మే-26
లక్ష్మి-కృష్ణ
చిట్టినగర్-విజయవాడ

పి. అరవింద్‌కుమార్
4సం॥, మే-2004
ఉషారాణి-యాదగిరి
ఏదులాపురం-ఖమ్మం

సన్నీ పూరి
1సం॥, మే-2007
సంగీతాదేవి-దినేష్‌గోస్వామి
బైపాస్‌రోడ్డు-ఖమ్మం

వి.సిరి సాధ్విత
2సం॥, మే-2006
హేమశ్రీ-విజయవర్మ
అయ్యప్పనగర్-విజయవాడ

లక్ష్మీశ్రీనివాస్
1సం॥, మే-2007
శైలజ-నాగేశ్వరరావు
నెల్లూరు

పి. ఫరీదాబాను
1సం॥, మే-26
జమీలాబేగం-
మహబూబ్‌బాషా
ఓర్వకల్లు-కర్నూల్

దామిని(సోని)
2సం॥, మే-2006
లక్ష్మి-ద్రోణాచారి
మాధవానిపల్లి



విద్య వ్యాపారం అవడం వల్లే ఇదంతా...

మన అతిథి

పేరు	:	పల్లె రంగారెడ్డి,
తల్లిదండ్రులు	:	పల్లె సంజీవమ్మ, పల్లె ఫకీర్‌రెడ్డి,
పుట్టిన తేది	:	**16.12.1940**
స్వస్థలం	:	క్యాతూర్ గ్రా, అలంపూర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.
విద్య	:	మాస్టర్ ఆఫ్ సర్జరీ (ఆప్తాల్మజీ), డిఓ (ఆప్తాల్మజీ)
నచ్చిన వ్యక్తులు	:	గాంధీ, నెహ్రూ
బలం	:	సేవ, మానవత్వం
మరచిపోలేని సంఘటనలు	:	ప్రజలకు సేవచేయాలని ఎం.డి జనరల్ మెడిసిన్ కోర్సు కాదని, ఎం.ఎస్ (ఆప్తాల్మజీ)లో చేరడం. ఉచితంగా **80,000** కంటి ఆపరేషన్లు చేయడం.
ఆశయం	:	పది మందికి సహాయం చేయడం
అవార్డులు	:	అక్టోబర్ రెండు, **1997**లో ఒక్క రోజులో **324** కంటి ఆపరేషన్లు చేసినందుకు గిన్నిస్ బుక్ రికార్డు. లిమ్కా బుక్‌లో పేరు. అమెరికా వారిచ్చిన అంబాసిడర్ గుడ్ విల్ అవార్డు.
నెరవేరని కోరిక	:	ప్రభుత్వం కేటాయించిన మూడు ఎకరాల్లో కంటి ఆసుపత్రి, అంధులకు జాతీయ యూనివర్శిటీ ఏర్పాటు చేయడం.
పర్యటనలు	:	రష్యా, అమెరికా,బ్రిటన్ కెనడా, జపాన్.

ప్రపంచలోని అన్ని సంస్కృతులు, సంప్రదాయాల కన్నా మన దేశ సంస్కృతులు, సంప్రదాయాలు గొప్పవి. మన వారికి అన్ని విషయాల్లో చాలా ఓపిక ఎక్కువ. పాశ్చాత్య దేశాల్లో పిల్లలకు పద్నాలుగేళ్లు వచ్చే సరికి వారిని వదిలేస్తారు. కానీ మన దేశంలో ఇంకా కుటుంబ వ్యవస్థ ఉన్నందుకు సంతోషపడాలి. తల్లిదండ్రులు ఇప్పటికీ పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, మమతానురాగాలను అందిస్తున్నారు. ఈజీ మనీ సంస్కృతి పెరగడంతో యువకుల్లో నైతిక విలువలు క్షీణిస్తున్నాయి. విద్యా వ్యవస్థ మారడం, విద్య వ్యాపారం అవడం వల్లే ఇదంతా జరుగుతోంది. మన దేశంలోని రాజకీయ వ్యవస్థ మారాలి. అధిక సంఖ్యలో రాజకీయ పార్టీలు వుండడం వల్ల దేన్ని ఎంచుకోవాలో జనం అయోమయంలో వున్నారు. అమెరికా, బ్రిటన్... దేశాల తరహా రెండు పార్టీల వ్యవస్థ వుంటే మంచిది.

ఈ సంచికలో....

టపా	...	2
సమ్‌థింగ్ స్పెషల్	...	3
ఆరోగ్యం	...	5
సీరియల్	...	8
సినిమా	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీద కథ	...	14

ఇంకా...

మంచిపుస్తకం ...6

బడుగునేతల అంతర్వాహిని అంబేద్కర్ మార్గం



చూద్దామా ... 4

సాత్పుర రాణి 'పాచ్‌మరి'

విజ్ఞాన వీచిక	...	17
లాహిరి... లాహిరి	...	20
మనసా... తెలుసా	...	22
రుచి	...	23
కొత్త పుస్తకాలు	...	24



కథ ... 18

వృత్తానికి ముగింపు



మంచి పుస్తకం చాలా బాగుంది

మక్సీమ్ గోర్కీ రాసిన అమ్మ పుస్తక సమీక్షలో కళ్ళ ముందుంచిన కొన్ని సత్యాలను తెలుసుకోగలిగాం. ప్రపంచ సాహిత్యంలో అమ్మతో పోల్చదగిన పుస్తకం మరొకటి లేదంటూ చేసిన అమ్మ పుస్తక పరిచయం చాలా బాగుంది. తెలుసుకుందామాలో నర్సులందరికీ నిలువెత్తు ఆదర్శం నైటింగేల్ గురించి చదివి ఎంతో ఉత్తేజితులమయ్యాం. పురాతనమైన నర్సింగ్ గురించి ... దాని అంతర్జాతీయ గుర్తింపు గురించి ప్రత్యేకంగా తెలియజేసినందుకు ధన్యవాదాలు. అట్టమీది కథ 'పాపాయిని స్వాగతిద్దాం' బావుంది. ఆడపిల్ల ఎందుకు వద్దు, ఆడపిల్ల పుడితే అన్నీ ఖర్చులే అంటూ మగపిల్లవాడి మీద ఉన్న క్రేజ్ తెలియజేశారు. ఆడపిల్ల అంటే ఎవరికైనా అంత తేలిక ఎందుకో, మనిషి మనిషిగా బతకటం నేర్చుకున్న వారు ఈ విధమైన తేడాను చూపలేరు. పశుప్రాయులైతేనే తేడాను చూపుతారు. కానీ, ఆడపిల్లను వదిలించుకునే రోగం ఇప్పటిది కాదంటూ కనుమరుగౌతున్న కనుపాపల గురించి వివరించిన తీరు బాగుంది. గర్భస్థ శిశువు ఆడో, మగో తెల్సుకోవడం నేరమంటూ హైకోర్టు న్యాయవాది జి.ఎల్. నరసింహారావు గారు ఇచ్చిన సందేశం కళ్ళకు కట్టినట్లుగా నాకు ఇప్పటికి పూర్తిగా అర్థమైంది. సీమ ఏదైనా సీను మాత్రం ఇదే. అందుకే సమాజ మార్పు కోసం పాటుపడదాం. చిట్టిపాపను స్వాగతిద్దాం!

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక, కృష్ణాజిల్లా.

అమ్మ అంటే జీవిత పోరాటం

అమ్మ నవల గురించి అనేక విషయాలు తెలియజేసినందుకు ధన్యవాదాలు. దీని తరువాత ఇంత గొప్ప నవల రాలేదు. పాత్రలన్నీ సజీవమైనవే. కాని నేడు ఆ పోరాటపటిమ కార్మికులలోను, నాయకత్వాలలోను లేదు. ఆ నవల చదివే వారి సంఖ్య చాలా తగ్గింది. ఉద్యమకారులకు అమ్మ నవల స్ఫూర్తి అవసరం. మానవాళికి మహోన్నత సేవలందించిన నైటింగేల్‌ను నర్సులే కాదు వైద్యులు, సిబ్బంది కూడా ఆదర్శంగా తీసుకోవాలి. అలాగే చైనాలో సేవలందించిన డాక్టర్ నార్మన్ బెతూన్ గురించి తెలియజేయండి.

టి.శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

అట్టమీది కథ స్పందింపచేసింది

మాతృ దినోత్సవం సందర్భంగా మాగ్జిం గోర్కీ నవలను మంచి పుస్తకం శీర్షికలో ఇవ్వడం బావుంది. విశ్లేషణలు మమ్ములను ఎంత గానో ఆకట్టుకున్నాయి. అమ్మంటే సమాజమే! అమ్మంటే జీవిత పోరాటమే! ఇది నిత్య సత్యమైన బహిరంగ సిద్ధాంతం. బాల్యంలోనే అమ్మ ఎన్నో జీవిత సత్యాలను, ఉగ్గుపాలతో పాటే నేర్పుతుంది. పాపాయిని స్వాగతిద్దాం! లో కొమ్మూలపాటి అంజన విశ్లేషణ మమ్ములను ఎంతో స్పందింపచేసింది. నేటి ప్రపంచం శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతోంది. అయినప్పటికి ఇంకా ఎందరో తల్లిదండ్రులు మూఢ నమ్మకాలను వదిలిపెట్టడంలేదు. ఆడపిల్లలను అబార్షన్ల రూపంలో వదిలించుకోవడం అమానుషం! రానురాను ఆడపిల్లల సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా తగ్గిపోతోందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు! రాజస్థాన్‌లోని దేవా గ్రామంలో కేవలం 12 మంది ఆడపిల్లలున్నారన్న విషయం అట్టమీద కథ చదివిన ఎవరినైనా ఆశ్చర్యచకితులను చేస్తుంది! రాబోయే రోజుల్లో ఆడపిల్లల సంఖ్య బాగా తగ్గితే మగ వాళ్ళకి పెళ్ళిళ్ళు కాక బ్రహ్మచారులుగా మిగిలిపోవలసిందే. అందుకే మేధావులు చెప్పే సలహాలు ఇప్పటికైనా పాటించాలి. అల్ట్రాసౌండు సిస్టమ్ ద్వారా గర్భంలో వున్నది ఆడో, మగో గుర్తించి ఆడపిల్లల భ్రూణ హత్యలకు పాల్పడటం, చట్టరీత్యా నేరమని గ్రామాలు, పట్టణాలు, నగరాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలియచేయాలి. ఇది ఆరోగ్యశాఖ వారే చేయాలి.

జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ, తూ.గో.జిల్లా.

గొప్పగా చెప్పారు

గాంధీ, భగత్‌సింగ్ తనకు నచ్చిన వ్యక్తులంటూ, ఈ వారం అతిథి పరకాల చెప్పిన మాటలు గొప్పవి. నా మనవడు "హ్యాపీబర్త్‌డే" పేజీలో తన ఫొటో చూచుకొని మురిసిపోయాడు. అమ్మ అంటే జీవితం... జీవిత పోరాటం అనడం బాగుంది. నైటింగేల్ ఆదర్శ జీవితం, మన జీవితాలకు ఆదర్శం కావాలి. చిట్టిపాపకు చిరునవ్వు కావాలి. అబార్షన్లతో హత్య కాదు. మ్యాంగో కుల్ఫీ హాయి అయిన వంటకం. కలం స్నేహం కావాలి. కలలన్నీ నిజమవ్వాలి. తల్లి ప్రేమ, భ్రమ కాకూడదు. బిడ్డ బతుకు భారం కాకూడదు. కార్టూన్లు బాగున్నాయి.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్, నెల్లూర్-2

ప్రతి గర్భిణీ దాచుకోవాల్సిన పేజీలు

ఆడపిల్ల పుడితే గుదిబండలా భావించి ఆ ఆడపిల్లను పరలోక ప్రయాణం కట్టించడానికి తల్లితండ్రులు ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల క్రమంగా ఆడపిల్లల సంఖ్య తగ్గిపోవడం గురించి 11వ తేదీ ప్రజాశక్తి ఆదివారం అనుబంధం అట్టమీది కథ ద్వారా తెలుసుకున్నాం. తల్లులు కూడా చాలామంది తమకు ఆడపిల్ల పుడితే దురదృష్టంగా భావించడం బాధాకరం. ఆడపిల్లల సంఖ్య తగ్గితే కలిగే దుష్పరిణామాలను గురించిన ఎన్నో విషయాలను ప్రచురించిన ఈ 'కవర్ స్టోరీ' ని చదివిన తర్వాతైనా తమ ఆలోచనా సరళిని మార్చుకుంటే సమాజంలో మంచి మార్పును కోరిన వారవుతారు. స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచవలసిన అవసరం ఎంతైనా



ఉంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులకు ప్రోత్సాహకరంగా విలువైన బహుమతులను ప్రభుత్వం వారు ఇవ్వగలిగితే బాగుంటుంది. అలాగే 'ఆరోగ్యం' శీర్షికలో 'గర్భధారణ' ముందు తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఎంతో విలువైన సమాచారాన్ని డా॥ఉదయినిగారు అందించారు. ఈ రెండు పేజీలను ప్రతీ గర్భిణీ దాచుకొంటే ఎంతో ఉపయోగకరం. 'చూద్దామా' శీర్షికలో పూనాలోని సుందర ప్రదేశాలైన లోనావాలా, ఖండాలాను గురించిన ఎన్నో విషయాలను తెలుసుకున్నాం.

గొల్లమండల సురేష్ కుమార్, సీతారాంపురం, ఖమ్మం.

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

వేషాలు మార్చడంలో దిట్ట

పెండెం కృష్ణకుమార్

ఏ రోగానికి ఏ మందు వేయాలో తెలుసు అతనికి...అట్లాగే ఏ వేషానికి ఏ డైలాగులు చెప్పాలో కూడా తెలుసు. వృత్తి రీత్యా మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తున్న ఇతను అతి తక్కువ సమయంలో వేషాలు మార్చి ఆయా పాత్రలకు తగ్గ డైలాగులు చెప్పడంలో దిట్ట. ఆ వ్యాపకంతోనే లిమ్కాబుక్‌లో చోటు సంపాదించాడు. ప్రస్తుతం గిన్నిస్‌బుక్ రికార్డు సాధించడంకోసం రెండున్నర గంటల్లో ఏకధాటిగా 13 వేషాలు మార్చి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు లోను చేశాడు. ఇతనే నల్గొండ జిల్లా సూర్యాపేట పట్టణానికి చెందిన పెండెం కృష్ణకుమార్.

అలెగ్జాండర్‌లా...

శబరిలా...

అది మార్చి 13 2008 రాత్రి. 7గంటల నుండి 9.30 గంటల ప్రాంతంలో నల్గొండ జిల్లా సూర్యాపేట పట్టణంలోని గాంధీపార్కు సెంటర్‌లో పెద్దఎత్తున ప్రజల కోలాహలం. ఎవరి నోట విన్నా ఈ ప్రోగ్రాం గురించే. సూర్యాపేట పట్టణానికి చెందిన పెండెం కృష్ణకుమార్ రెండున్నర గంటల సమయంలో ఏకధాటిగా 13 వేషాలు ధరించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఆయా వేషాలకు సంబంధించిన డైలాగులు చెబుతూ సభికులను ఆశ్చర్యచకితులను చేశాడు. వృత్తిరీత్యా మెడికల్ ఏజెన్సీలో కొనసాగుతున్న కృష్ణకుమార్ ఎం.ఎ వరకు చదువుకున్నాడు. గతంలో లిమ్కాబుక్ ఆఫ్ రికార్డును సాధించిన ఇతను గిన్నిస్‌బుక్ రికార్డే ధ్యేయంగా ప్రయత్నాలు ప్రారంభించాడు. 13వ తేదీన ప్రదర్శించిన వాటిలో నారద మహర్షి, శివుడు, శబరి, శివాజీ, క్రిస్మస్ తాత, అలెగ్జాండర్, ఘటోద్గజుడు, షేక్స్‌పియర్, జీసెస్, రావణుడు ఇలా విభిన్న వేషాలను ధరించాడు. ఇప్పటి వరకు జఙ్రీహాల్ అనే విదేశీ మహిళ రెండు గంటల్లో ఆరు వేషాలు ధరించి గిన్నిస్‌బుక్ రికార్డు నమోదు చేసింది. ఈ రికార్డును బ్రేక్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు పెండెం కృష్ణకుమార్ చెప్పాడు

రికార్డుల బీజం ఇలా...

పెండెం కృష్ణకుమార్ 7,8 తరగతులు చదువుతున్నప్పుడే విచిత్ర వేషాలు ధరించేవాడు. ఆ తర్వాత మరింత ఆసక్తిని పెంచుకొని సుధాకర్ అనే డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్మించిన 'శభాష్ అల్లుడు','మామా మజాకా', 'ప్రేమ విజయం' ఎపిసోడ్స్‌లో హీరోగా కూడా నటించారు. అనంతరం టెలీ ఫిలిం మేకప్‌లలో నంది అవార్డు గ్రహీత అయిన అశోక్‌పవార్ సహకారంతో 29 ఏప్రిల్ 2006లో ఒకే రోజు ఏకధాటిగా 11.30 గంటల్లో 65 కళలకు సంబంధించిన వివిధ వేషాలు ధరించి లిమ్కాబుక్ రికార్డు సాధించాడు.

మరి మన కృష్ణకుమార్‌కు గిన్నిస్ బుక్ రికార్డు దక్కాలని కోరుకుందామా..!

శివుడిలా...

నారదునిలా...





యాజీవ్

మధ్య భారతంలోని మధ్యప్రదేశ్‌లో వున్న ఒకే ఒక హిల్ స్టేషన్ పాచ్‌మరి. సాత్పురా పర్వత శ్రేణులలో సుమారు 3000 అడుగుల ఎత్తులో వున్న ఈ ప్రదేశం గుహలకీ, అడవులకీ ప్రసిద్ధి. దీనిని బ్రిటీష్ సైన్యానికి చెందిన కెప్టెన్ జేమ్స్ ఫోర్సిత్ 1837లో కనుగొన్నాడు. ఇక్కడి ప్రశాంత, స్వచ్ఛమైన వాతావరణాన్ని చూసి 1862లో ఒక శానిటోరియంని కూడా బ్రిటీష్ వాళ్లు వాళ్ల సౌకర్యం కోసం నిర్మించారు. అది ఇప్పుడు ఆర్మీ ట్రైనింగ్ కాలేజీగా మారింది.

సాత్పుర రాణి 'పాచ్‌మరి'



పాచ్‌మరిలో అడవులు, కాలువలు, జలపాతాలు, కొండలు, లోయలు, క్రీపూ పదివేల ఏళ్లకు పూర్వం వేసినవిగా చెప్పుకునే గుహల్లో కుడ్య చిత్రాలు, విస్తారమైన వన సంపద మనసుకు ఆనందాన్ని, అద్భుతాన్ని కలిగిస్తాయి. అసలు ఈ లోయనే విచిత్రంగా వుంటుంది. ఒక గిన్నె/సాసర్ ఆకారంలో వుండే ఈ లోయ బ్రిటీష్ వారిని ఆకట్టుకుందంటే ఆశ్చర్యంలేదు. మిగతా హిల్‌స్టేషన్లకన్నా పాచ్‌మరి కాస్త ప్రశాంతంగా (జనాల తాకిడి తక్కువగా) వుంటుంది. అందువల్లే కాబోలు ఇక్కడ ప్రకృతి మరింత సహజంగా, పిట్టల శబ్దాలకంటే ఎక్కువ నీటి శబ్దాలతో కళకళలాడుతూ వుంటుంది. పైగా, ప్రాంతాన్ని బయోస్ఫియర్ రిజర్వ్‌గా ప్రకటించి ప్రభుత్వం ప్రకృతి సహజ సంపదను కాచి కాపాడుతోంది. అక్కడక్కడా ఆధునిక నిర్మాణాలు కనిపించినా, బ్రిటిష్ కాలంనాటి చర్చీలు, బంగళాలు, స్మశానవాటికలూ ఈ ప్రాంతానికి ఒక రకమైన పాతదనాన్ని ఆపాదిస్తాయి. తొలిసారి ఈ ప్రదేశాన్ని చూసిన వ్యక్తి పేరు మీద దీనిని ఫోర్సిత్ పాయింట్ అని పేరు పెట్టినా, తరువాత దీనికి ప్రియదర్శిని పాయింట్ అని పేరు మార్చారు.

ఇక్కడ చాలా చోట్ల గుహలు కనిపిస్తాయి. అసలు దీని పేరే పాంచ్ (ఐదు) మారి (గుహలు). పాండవులు వనవాసం చేసే కాలంలో కొంత కాలం ఈ ప్రదేశంలో వున్నారని స్థల పురాణం. అయితే వీటిని గుప్తుల కాలంలో బౌద్ధులు నిర్మించారని పురాతత్వ శాస్త్రవేత్తలు అంటారు. ఇక్కడ గోండ్లు, కొర్కులు జీవనం వుంటారు. అడవులలోని సన్నని దారులలో కొండలెక్కడం ఒక మంచి అనుభవం. నడవడం, కొండలెక్కడం పడని వారికి దగ్గర్లోనే బోలెడన్ని టూరిస్టు స్పాటులున్నాయి.

ఇక్కడ వున్న గుహలలో జటాశంకర గుహ చూడవలసింది. శివుడి జుట్టులా కనిపించే కొండ వల్ల ఆ పేరు వచ్చింది. జంబూ ద్వీప సరిత ఈ గుహ నుండే పుడుతుంది. జలావరణ్ జలపాతాలు చూస్తుంటే ఆశ్చర్యం కలగకమానదు. దాదాపు 4 కిమీ ఎత్తునుంచి ఏ అడ్డూ లేకుండా పడే ఈ జలపాత దృశ్యం అద్భుతమే. దీనినే డచెస్ ఫాల్స్ అనికూడా అంటారు. పాండవ గుహల పక్క నుంచి నడిచి వెళ్తే ఒక అందమైన కొలను వుంటుంది. ఈ కొలను ఒక ఎత్తైన జలపాతం వల్ల ఏర్పడింది. దీనిలో స్నానాలు చేయవచ్చు. ఈ కొలనుని అప్సర విహార్ అంటారు. అప్సర విహార్‌కి సుమారు అరకిలోమీటరు దూరంలో రజత్ ప్రభాత్ అనే జలపాతం వుంటుంది. 350 అడుగుల నుంచి వెండి జాలువారుతున్నట్టు అనిపిస్తుంది. కాబట్టి ఆ పేరు వచ్చింది దీనికి.

మహాదేవ్ అనే ప్రదేశం పట్టణం నుంచి దాదాపు 10 కిమీ దూరాన వుంది. ఇక్కడ శివుడి 'గుహ గుడి' వుంది. శివుడు భస్మాసురుడికి వరమిచ్చి, ఆ రాక్షసుడికి భయపడి ఇక్కడ దాక్కున్నాడని అంటారు. ఇక్కడ ఒక శివలింగం కూడా వుంది. గుహ ఎదురుగా భస్మాసురుడు తన చెయ్యి తన తలపైనే పెట్టుకుని భస్మమైపోయిన స్థలంలో 'భస్మాసురకుండ్' అనే చిన్న తటాకం వుంది.

ఇక్కడికి ఓ నాలుగు కిమీ దూరంలో చాలా ఎత్తులో చౌరాగర్ వుంది. ఇక్కడ కూడా శివదేవాలయం వుంది. శివరాత్రి సమయంలో వేలాది భక్తులు బరువైన త్రిశూలాలు చేతబూని 1300 మెట్లు ఎక్కుతూ భక్తిని చాటుకుంటారట.

ఇంకా ఎన్నో జలపాతాలూ, గుహలూ, కోనలూ చూడదగ్గవే వున్నాయి. కానీ సాత్పుర జాతీయవనం చూడకుండా రావడం ఒక అద్భుత అనుభూతిని కోల్పోవడమే. ఈ 524 చకిమీల దట్టమైన అడవిలో గడపడానికి అధికారుల అనుమతి తీసుకోవచ్చు. టూరిస్టు హౌసూ, ఫారెస్టు బంగ్లాలు వుంటాయి. 'వానికి సంగ్రాలయ' అనే మ్యూజియం కూడా వుంది.

ఇంకా కాథలిక్ చర్చి, క్రైస్ట్ చర్చి కూడా ఆనాటి నిర్మాణ శైలిని చూపుతాయి. పాచ్‌మరి ఇతర టూరిస్టు స్థలాల్లా కాకుండా కాస్త భిన్నంగా వుంటుంది. ఎక్కువ ప్రాచీనత కనిపిస్తుంది. ఎక్కువ ప్రకృతీ కనిపిస్తుంది. 'సరదాగా కాలక్షేపం' అని కాకుండా కాస్త సాహసోపేతమైన ట్రెక్కింగ్ వంటివి చేయడానికీ అడవులలో చెట్ల మధ్య సేదతీరడానికీ ఈ ప్రదేశం బావుంటుంది. వణికించే చలీ గత్రాలు వుండవు కానీ కొత్త రకమైన అనుభూతికి ఇది చక్కని ప్రదేశం. ✻



పాచ్‌మరి

ఆరోగ్యం

డాక్టర్ శ్రీనివాస్ కిషోర్,
ఇఎన్‌టి, హెడ్‌నెక్ సర్జన్, మెడిసిటీ హాస్పిటల్స్, హైదరాబాద్.
98480 18667, 92463 64600



బుల్లి ఏసీకి జబ్బు చేస్తే.....?

ఎండాకాలంలో ముక్కు సైనస్‌లకు కాస్త బ్రేక్ దొరికిందని చాలా మంది అనుకుంటారు. శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ మన జీవన విధానాలు మారుతున్నాయి. దీంతో ఎయిర్ కండిషనింగ్‌కు బానిసలవుతున్నాం. ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడిపే వారి సంఖ్య పెరుగుతోంది. ఏసీ ఉష్ణోగ్రత 20 నుంచి 22 డిగ్రీలుంటే బయటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు. ముక్కు మనం పీల్చిన గాలి వేడిగా వుంటే చల్లబరుస్తుంది. అదే మనం శ్వాసించేగాలి చల్లగా వుంటే వేడిగా చేస్తుంది. ఆ తర్వాతే లోపలికి పంపిస్తుంది. అందుకే ముక్కును బుల్లి ఏసీగా అభివర్ణించొచ్చు. ముక్కులోని రక్తాన్ని బట్టి ఈ ప్రక్రియ జరుగుతుంది.

ఏసీ రూంలో నుంచి అకస్మాత్తుగా బయటికొస్తే...ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి ముక్కులో రక్తప్రసరణ అధికమౌతుంది. ముక్కులో వాచి రక్తం కారుతుంది. దీంతో ముక్కు బ్లాక్ అవుతుంది. ఇలాంటి పరిస్థితిలో సాధారణంగా అందరూ ముక్కు చీదుతారు. కానీ ముక్కులోని చర్మం రక్తంతో వుంటుంది. చీదగానే రక్తం వస్తుంది. వేడి చేసిందని చాలా మంది తలపై మంచు గడ్డలను, తడిబట్టను పెడుతుంటారు. ఇలా చేయకూడదు. రక్తస్రావం మాత్రం కొనసాగుతుంది.

మనం ఉండే వాతావరణంలో తేమ వుండదు. ముక్కులో కూడా తేమ ఉండదు. అంతా ఎండినట్లుంటుంది. దీంతో పొక్కులు కట్టి దురద కలుగుతుంది. దీంతో ముక్కులో వేళ్లుపెట్టుకుని తీసుకుంటారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎక్కువగా ముక్కులో వేళ్లుపెడతారు. దీంతో గోళ్లతో ముక్కు చర్మానికి గాయమై రక్తం కారుతుంది. ఈ గాయం ఇంకా పెరిగి పెద్దదవుతుంది. మందులకు తగ్గకుండా తయారవుతుంది.

ఏం చేయాలి?

వ్యాజిలిన్ శీతాకాలంలోనే వాడాలి, ఎండాకాలంలో మూలన పెట్టాలని అనుకుంటారు. ఎండాకాలంలో కూడా దీన్ని తప్పకుండా వాడాలి. ఇది ముక్కులోని చర్మానికి రక్షణనిస్తుంది. బయటికెళ్లే ముందు కొద్దిగా వ్యాజిలిన్ ముక్కులో పెట్టుకుంటే ముక్కులో తేమగా వుంటుంది. ముక్కు చర్మాన్ని ఎండిపోకుండా ఆపుతుంది. ఎండిపోకుంటే పొక్కులు రావు, పొక్కులు రాకుంటే దురద రాదు, దురద రాకుంటే రక్తం రాదు.. వ్యాజిలిన్ ఇలా ముక్కుకు మేలు చేస్తుంది.

గొంతు పొడిబారడం

వేసవిలో వచ్చే ఇంకో సమస్య గొంతు పొడిబారడం. నీళ్లు తాగకపోవడం వల్ల ఇది జరుగుతుంది. గొంతులోని రక్షణ కవచం మ్యూకస్ ఎండిపోతుంది. దీంతో గొంతు పట్టేస్తుంది. మింగేటప్పుడు ఏదో గుచ్చుకుంటున్నట్లుంటుంది. శీతాకాలంలోనే ఇన్‌ఫెక్షన్ వస్తుందని చాలా మంది అపోహ పడుతుంటారు. ఎండలో బాగా తిరిగి బాగా చల్లని నీరు తాగడం చాలా మంది చేసేదే. ఇలా చేయకూడదు. బాగా మాడిన పెనంపై చల్లటి నీళ్లు పోస్తే ఏమవుతుంది? పుస్సుమని నీరు ఆవిరవుతుంది. అలాగే బాగా ఎండిపోయిన గొంతులోకి చల్లటి నీళ్లను పోస్తే అదే జరుగుతుంది. దీంతో మ్యూకస్‌పొర దెబ్బతిని క్రిములు అక్కడ చేరి ఇన్‌ఫెక్షన్ కలుగుతుంది.

చికిత్స

ముక్కులో రక్తం : ముక్కులో రక్తం కారడమనేది ఎక్కువగా చిన్న పిల్లల్లో చూస్తుంటాం. దీంతో పిల్లలు తలను వెనక్కు లాగుతారు. దీని వల్ల ఎంత రక్తం కారుతుంతో తెలియదు, రక్తం అంతా కడుపులోకి వెళ్తుంది. లోపలికి వెళ్లిన రక్తం జీర్ణాశయంలో ఇరిటేట్ అయ్యి రక్తపు వాంతులొస్తాయి. అలా కాకుండా మొదట చేయాల్సింది ముక్కును ముందుకు వంచాలి. బొటనవేలు, చూపుడు వేలితో ముక్కును గట్టిగా నొక్కితే రక్తస్రావం ఆగుతుంది. ఇలా ఐదు నిమిషాలుంచాలి. ఐస్ ముక్కలను తలపై కాకుండా ముక్కుపై పెడితే ప్రయోజనం వుంటుంది. అప్పటికీ రక్తం కారడం ఆగకుంటే దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. చిన్న పిల్లల్లో రక్తనాళాలు దెబ్బతింటే అవే మూసుకుని, రక్తస్రావం కాదు. రక్తపోటు అధికంగా ఉన్న పెద్దవారిలో వారిలో ఈ పరిస్థితి వుండదు. ముక్కులో స్పాంజ్‌నుపెట్టి బ్లాక్ చేస్తారు. ఎక్కడి నుంచి రక్తస్రావం అవుతుందో కనుక్కుని శాశ్వతంగా రక్తనాళాలను మూసేస్తారు. అయినా రక్తస్రావం ఆగకుంటే ముక్కు నుంచి మెదడుకు వెళ్లే రక్తనాళాన్ని కట్ చేస్తారు. ముక్కులో నుంచి రక్తం కారడానికి రక్తంలో లోపం ఉందా?లేదా? అని పరీక్షించుకోవాలి. రక్తం గడ్డకట్టడానికి అవసరయ్యే కణాలు తగిన మోతాదులో ఉన్నాయా? ఇవి బాగున్నా రక్తం గడ్డకట్టడానికి అవసరయ్యే కణాల గురించి చూడాలి. దురద వల్ల పిల్లలు ముక్కులో వేలు పెడతారు. దురద తగ్గడానికి క్రీములు ఉపయోగించాలి.

గొంతు ఇన్‌ఫెక్షన్ : బయట ఎండలో తిరిగాక ముందు మామూలు నీళ్లు తాగాలి. 15 నిమిషాలయ్యాక చల్లని నీళ్లు తాగాలి. వేసవిలో కూల్‌డ్రింకుల్లో అనేక ప్రిజర్వేటివ్స్, గ్యాసులుంటాయి. ఇవి చర్మంలోకి వెళ్లి ఇన్‌ఫెక్షన్ కలిగిస్తాయి. మంచినీటితో తీరే దాహం దేనితో తీరదు. 90 శాతం మందికి ఏం కాదు, కేవలం పది శాతం మందిలోనే తేడా కనిపిస్తుంది. ఇన్‌ఫెక్షన్ వచ్చిన వారు గోరువెచ్చని ఉప్పునీళ్లతో పుక్కిలించాలి. తగ్గకుంటే డాక్టర్‌ను సంప్రదించాలి.

❄

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

ఈ ఫొటో ఓ ప్రముఖ హీరోయిన్‌ది. ఎవరో తెలియాలంటే 21వ పేజీ చూడండి

శైలి

"రష్యా విప్లవం ప్రధాన లక్ష్యం సమానత్వాన్ని సాధించడం. అందువల్లనే మనం స్వాగతిస్తున్నాం. అయితే సమాజ స్థాపన కోసం సోదరభావాన్ని, స్వేచ్ఛను త్యాగం చేయలేం. అవి లేకుండా సమానత్వానికి విలువలేదు. బుద్ధుడి మార్గం అనుసరించడం ద్వారా స్వేచ్ఛ, సోదరభావం, సమానత్వం పొందగలం. ఈ మూడు సహజీవనం చేయగలుగుతాయి"

అని భావించారు.



బడుగునేతల అంతర్వాహిని అంబేద్కర్ మార్గం

అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు. శక్తి. అట్టడుగు ప్రజల హృదయాంతరాళాల్లో బలంగా నాటుకున్న శక్తి. యుగాలు మారినా తరాలు మారినా (అస్పృశ్యత)ను ఎందుకు పాటిస్తున్నారు! ఈ వివక్ష ఇంకెంతకాలం? ఎప్పుడు పోతుంది? ఈ కళంకాన్ని రూపుమాపాలంటే ఏం చేయాలి? ఈ శోధనలో జీవితకాలం తపోదీక్షతో అహరహం శ్రమించిన ఓ మామూలు మనిషి. ఇంకా చెప్పాలంటే అట్టడుగు వర్గంలో జన్మించి, అవమానాలు, హేళనలు, విమర్శలు భరించిన మనిషి. గాంధీ మహాత్ముణ్ణి సైతం కొండను ఢీకొన్నట్టు ఢీకొన్న మనిషి కార్యదీక్షతో భారతదేశానికి రాజ్యాంగాన్ని ప్రసాదించే నిర్మాతగా ఎదిగిన మనిషి బాబా సాహెబ్ అంబేద్కర్. ఈ మహా మనిషి విశ్వరూపాన్ని రేఖామాత్రంగా దర్శించేందుకు ఉపకరించే పరిశోధనాత్మక గ్రంథం డబ్ల్యు.ఎన్.కుబేర్ రచించిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విశ్లేషణాత్మక అధ్యయనం'.

"అంటరానితనాన్ని తొలగించేందుకు ఈ బ్రిటీష్ ప్రభుత్వం ఏమైనా చేపట్టిందా? గ్రామాలలో అంతకు పూర్వం వీరు నీరు తోడుకోలేకపోయేవారు. ఆ హక్కును వారు మీకు కల్పించారా? వారి పాలనకు ముందు మీకు దేవాలయాలలో ప్రవేశించే హక్కు లేదు. ఇప్పుడు వెళ్ళగలరా?

సామ్రాజ్యవాదంపై సంధించిన అప్పటి ప్రశ్నలకు స్వాతంత్ర్యం లభించిన 60 ఏళ్ళ అనంతరం కూడా ఇప్పుడు జవాబు లభించడంలేదనేది యదార్థం.

అక్కడితో అంబేద్కర్ ఆగలేదు. 1931 మార్చి 16న అంబేద్కర్ కోర్టుకు హాజరై ముద్దాయిలు నలుగురి తరపున ధీటుగా వాదించారు. దేశ ప్రజలు గుర్తించి కృతజ్ఞతలు తెలిపారు.

రెండవదశ 1929-36. ఈ కాలంలో అస్పృశ్యుల హక్కుల కోసం రాజకీయ పోరాటం చేశారు. భారతీయ జీవనంలో అస్పృశ్యులు ప్రత్యేక శక్తి అని పేర్కొంటూనే వారికి ప్రత్యేక కాలనీలు, రాయితీలు కావాలని డిమాండ్ చేశారు. అస్పృశ్యతకు మూలవిరాట్ అయిన హిందూ సమాజ వ్యవస్థపై తీవ్రమైన తిరుగుబాటు చేశారు. చివరకు హిందూవాదంతో తెగతెంపులు చేసుకోవాలనే సంకల్పాన్ని ఇయోలా సమావేశంలో వ్యక్తం చేశారు.

"నేను హిందువుగా పుట్టిన మాట నిజమే అయినా హిందువుగా మాత్రం చావను" అని 1935లో ప్రతిజ్ఞ చేశారు.

మనిషిని మహిమాన్వితునిగా చేసి ఆరాధించే తత్వం, మనిషికి దైవత్వం ఆపాదించే సంప్రదాయం, కర్తవ్య విముఖత ఈ మూడు హిందూ సమాజాన్ని శిథిలం చేశాయని, దేశం అత్యంత హీనస్థాయికి చేరుకోవడానికి ఈ మూడు అంశాలే కారణమయ్యాయని అంబేద్కర్ భావించారు.

మూడవదశ 1937-46. ఈ కాలంలో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించారు. 1937 శాసనమండలి ఎన్నికల్లో 15 రిజర్వ్‌డ్ స్థానాల్లో 13 స్థానాలను ఈ పార్టీ గెలుచుకున్నది. శాసనమండలి ప్రతిపక్ష నాయకునిగా కృషి చేశారు. 42లో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడయ్యాడు.

"ఎవరూ మీకన్నా మిన్నగా మీ యొక్క కష్టాలను, నష్టాలను తీర్చలేరు. వీటన్నింటినీ మీకు మీరుగా తీర్చుకునేందుకు మీకు రాజ్యాధికారం ఉండాలి. బ్రిటీష్ ప్రభుత్వం ఇలాగే అధికారంలో కొనసాగినంతకాలం మీకు అధికారంలో భాగస్వామ్యం ఉండదు. మీ ప్రజల విముక్తిని సాధించేందుకు అవసరమైన ఆ అధికారం పొందగలిగే వీలు ఏ మాత్రం ఉన్నా అది స్వరాజ్య రాజ్యాంగంలో మాత్రమే ఉన్నది.

'బడుగులకు రాజ్యాధికారం' అని మిన్నంటుతున్న నేటి నినాదాల బీజం నాటి నుండే ఉందన్న విషయం అర్థమౌతుంది.

'నేనేమి సాధించినా అది పూర్తిగా నా కులం బలం వలన సాధించిందే. హరిజన కులంలో జన్మించినందుకు నేను గర్వపడుతున్నాను. నా పనిలో ముఖ్య కర్తవ్యం నా కులం సంక్షేమమే. మూడు లక్ష్యాలున్నాయి. 1. విద్యను వ్యాప్తి చేయడం 2.

ప్రభుత్వోద్యోగుల్లో అస్పృశ్యులకు మరింత ప్రాధాన్యత కల్పించడం 3. గ్రామాలలో అస్పృశ్యుల పరిస్థితిని మెరుగుపరచడం"

అంబేద్కర్ వక్కాణించిన మాటలు, నినాదాలు బడుగు వర్గాల నేతల్లో కార్యకర్తల్లో ఎల్లప్పుడు అంతర్వాహినిగా పనిచేస్తుంటాయి. అలాగే ఆ లక్ష్యాలే తమ జీవన లక్ష్యాలుగా పాటిస్తుంటారు.

అంబేద్కర్ ప్రజాయానంలో ప్రధానంగా ఐదు దశలున్నాయి. 1918-28 వరకు ఆయన న్యాయవాదిగా నిలదొక్కుకోవడమే కాదు. ఆ తరువాత కూడా వాదనా పటిమతో దేశప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

మహారాష్ట్ర కొలాబా జిల్లాలో గల చిర్నార్ అడవిలో 1930 సెప్టెంబరు 25న సత్యాగ్రహం మొదలైంది. అరెస్టులు, కాల్పులు, మరణాలు సంభవించాయి. నాల్గవదశలో భారతరాజ్యాంగ రూపకల్పన కమిటీ చైర్మన్‌గా సారధ్య బాధ్యతను సమర్ధవంతంగా పోషించారు.

"ఆదేశిక సూత్రాలను రూపొందించడంలో మా లక్ష్యం ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించడం. ఆర్థిక లక్ష్యంపై దిశా, నిర్దేశం లేని కేవలం పార్లమెంటరీ తరహా ప్రభుత్వం ఏర్పాటు చేయడం కాదు. మన సామాజిక వ్యవస్థలో ఏమేమి ఉండాలనే విషయమై ఖచ్చితమైన అవగాహనలో భాగమే ఆదేశిక సూత్రాలు" అని తెలిపారు.

ఇక ప్రజాజీవనం చివరి దశలో ఆయన పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. 1956లో బౌద్ధం స్వీకరించారు. సమస్యలకు పరిష్కారం వర్గపోరాటాన్ని ఎంచక మత ప్రచారానికి ప్రాధాన్యత ఇచ్చారు. మార్క్సిజానికి ప్రత్యామ్నాయంగా బౌద్ధమతాన్ని చూపారు.

"రష్యావిప్లవం ప్రధాన లక్ష్యం సమానత్వాన్ని సాధించడం. అందువల్లనే మనం స్వాగతిస్తున్నాం. అయితే సమాజ స్థాపన కోసం సోదరభావాన్ని, స్వేచ్ఛను త్యాగం చేయలేం. అవి లేకుండా సమానత్వానికి విలువలేదు. బుద్ధుడి మార్గం అనుసరించడం ద్వారా స్వేచ్ఛ, సోదరభావం, సమానత్వం పొందగలం. ఈ మూడు సహజీవనం చేయగలుగుతాయి" అని భావించారు.

అంబేద్కర్ విశిష్టత మూడు అంశాల్లో కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అద్భుత వ్యక్తిత్వం, దృఢమైన చిత్తశుద్ధి, నిష్పపటత్వం, నిర్భీతి, నిజాయితీ, అన్నింటినీ మించి అస్పృశ్యుల పట్ల సంపూర్ణ అంకితభావం. అందుకే జీవితంలో కొంత సంక్లిష్టత ఉన్నప్పటికీ ఆయన చేపట్టిన ప్రతిరంగంలోనూ తన వెలుగును ప్రసరించుకుంటూ పోయాడు. ప్రతి ఒక్కరూ గర్వపడే ఆదర్శనీయుడయ్యాడు. 'కొండ అద్దమందు కొంచమైనున్నట్టు' అంబేద్కర్ సమగ్ర ఆలోచనా విధానానికి ఈ పుస్తకం అద్దం పడ్తుంది. 15 అధ్యాయాలు, 312 పేజీలు గల పుస్తక అనువాదం పాఠకులకు ఉత్సాహపరుస్తుంది.

డాక్టర్ బాబా సాహెబ్
అంబేద్కర్
విశ్లేషణాత్మక అధ్యయనం
డబ్ల్యు. ఎన్. కుబేర్
వెల:100/-, పేజీలు:312
ప్రతులకు:
ప్రజాశక్తి బుక్ హౌస్,
అన్ని బ్రాంచీలు.

❄









మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

అమెరికన్ తెగ

లిటిల్ వూల్ఫ్, డల్ నైఫ్

జరిగినకథ:

యుద్ధం కొనసాగింది. "ఐదవ రోజున వెళ్ళి జనరల్ మైల్స్ ముందు తుపాకీ కింద పడేశాను" అంటూ గుర్తు చేసుకున్నాడు జోసెఫ్. ఆ సందర్భంగా అతడిచ్చిన వాంగ్మూలాన్ని, ఇంగ్లీషు అనువాదంలో లెఫ్టినెంట్ చార్ల్స్ ఎర్స్కైన్ స్కాట్‌వూడ్ (తరువాతి కాలంలో వూడ్ న్యాయవాద వృత్తి చేపట్టాడు. జోసెఫ్, నెజ్‌పెర్స్‌ల పరిచయం అతణ్ణి బాగా ప్రభావితం చేసింది. ఇండియన్ల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం వుద్యమం చేపట్టి, రచయితగా, కవిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు) ఇలా రికార్డు చేశాడు. అమెరికన్ ఇండియన్లిచ్చిన వుపన్యాసాల్లో దీనికో ప్రత్యేక గుర్తింపు వున్నది.

(54వ భాగం)

"తన గురించి నాకు బాగానే తెలుసని జనరల్ హోవర్డ్‌కు చెప్పండి. అతడు చేసిన వాగ్దానాలను నేనింకా మరచిపోలేదు. జీవితమంతా యుద్ధం చేసి అలసిపోయాను. నా యోధులు నేలకొరిగారు. లుకింగ్ గ్లాస్ ఇప్పుడు లేడు. టూహూల్ హూ మా కోసమే మరణించాడు. మా తెగ పెద్దలెవరూ సజీవంగా మిగల్లేదు. అందువల్ల, యువకుల ఇష్టానుసారమే ఇదంతా జరిగింది. యువకుల నాయకుడు ఆలోకాట్ వీరమరణానికీ మేమంతా సాక్షులమే. చలి ఎముకలు కొరికేస్తున్నది. కప్పుకోవటానికి బ్లాంకెట్లు లేవు. చంటి పిల్లలు, మంచు గాలిలో వూపిరి తీసుకోలేక చచ్చిపోతున్నారు. ఈ ఇక్కట్లను భరించలేని కొందరు ఇప్పటికే కొండల్లో తలదాచుకుంటున్నారు. భోజనం, బ్లాంకెట్లు లేవు. మృత్యువు పలకరిస్తున్నది. మంచు దుప్పట్ల కింద దానితోనే సహజీవనం చేస్తున్నాం. కొండల్లోకి పారిపోయిన వాళ్లు కూడా చలికి గడ్డకట్టుకుపోయే వుంటారు. అందరూ నా పిల్లలే. వాళ్లలో ఎందరు బతికున్నారో కూడా తెలియదు. నా సహయోధులారా, మీకు నేను చేస్తున్న విన్నపమిది. నా మనసు, శరీరం, అలసిపోయాయి. గుండె బలహీనపడింది. ఈ సూర్యుని సాక్షిగా చెబుతున్నాను. ఇక నేను ఆయుధం పట్టను, యుద్ధం చెయ్యను"

చీకటి పడిన తర్వాత, లొంగుబాటు కార్యక్రమం కొనసాగుతున్నప్పుడే వైట్ బర్డ్ నాయకత్వంలో కొందరు యువకులు కెనడియన్ సరిహద్దు వైపు పరుగుతీశారు. రెండవ రోజు వాళ్లు ఆ దేశంలోకి ప్రవేశించారు. మూడవ రోజు, ఎటు పోవాలో తెలియక దారి తప్పిన ఈ కాందిశీకులకు గుర్రాల మీద ఎదురొచ్చిన ఇండియన్లు స్వాగతం పలికారు.

"మీది ఏ తెగ?"

"నెజ్‌పెర్స్. మీది?"

"సియో".

మరుసటి రోజు సిట్టింగ్ బుల్, తన నెజ్‌పెర్స్ సోదరుల్ని కెనడియన్ గ్రామానికి సాదరంగా ఆహ్వానించాడు.

జోసెఫ్ మాత్రం సైనికులకు బందీగానే మిగిలిపోయాడు. బేర్‌కోట్ మైల్స్, వీళ్ళందర్నీ, (జోసెఫ్ ఇతరులు) లా ప్యామ్ కి బదులు కాన్సాస్‌లోని ఫోర్ట్ లీవెన్‌వర్త్‌కు పశువుల లాగ వ్యాగన్లలో తరలించారు. అక్కడ, బురద గుంటను జైలుగా మార్చి ఈ యుద్ధ ఖైదీలకు 'రక్షణ' కల్పించారు. ఆ దుర్భర పరిస్థితుల్లో బతకటం అసాధ్యం. త్వరలోనే వంద మందికి పైగా మరణించారు. మాడాక్స్ లాగ, నెజ్ పెర్స్ కూడా క్రమంగా, వ్యాధులతో, బెంగతో మరణించారు.

ఆ కాలంలో, తరచుగా ఇండియన్ టెరిటరీని సందర్శించిన బ్యూరోక్రాట్లు, క్రిస్టియన్ మత గురువులు ఇండియన్ల పట్ల చాలా సానుభూతి ప్రదర్శించారు. వీళ్ళ పరిస్థితులు మెరుగు పడాలని రిపోర్టులు కూడా పంపించారు. ప్రభుత్వ ఆహ్వానం మీద, జోసెఫ్ ఒకసారి వాషింగ్టన్ వెళ్ళి అధికారులందరికీ తమ సమస్య వివరించాడు. "అందరూ మేం మీ మిత్రులమేనంటారు. న్యాయం చేస్తామంటారు. అలాగని వాళ్ల స్నేహం చేతల్లో కనిపించదు. లొంగిపోతే మాకు స్వేచ్ఛ నిస్తానన్నాడు జనరల్ మైల్స్. కాని ఇప్పుడు మా పరిస్థితి ఏమిటో చూస్తున్నారుగా" అంటూ ఆక్రోశించాడు జోసెఫ్. ఆ తర్వాత, తమకు ఎలాగైనా న్యాయం చెయ్యాలని ఈ 'సభ్య' సమాజానికి ఈ విధంగా మొర పెట్టుకున్నారు.

"మంచి మాటలు చెప్పటంలో ఇక్కడ అందరూ ఒకరి కన్నా ఒకరు ఘనులే. కాని ఎవ్వరూ ఏమీ చెయ్యరు. కార్యరూపం

దాల్చినప్పుడు మంచి అభిప్రాయాలకు విలువ లేదు. మాటల వల్ల నా మృత సహచరులు తిరిగి రారు. పరాధీనమైన నా దేశం తిరిగి నాకు దక్కదు. ఆకలితో అలమటిస్తున్న నా వాళ్ళ కడుపు నిండదు. నిత్యం రోగాలతో మరణిస్తున్న పిల్లల ఆరోగ్యం బాగుపడదు. తల దాచుకోవటానికి ఇళ్ళు రావు. ఈ వట్టి మాటలు విని విసిగిపోయాను. మాటలంటే ఎంత శుష్క ప్రేలాపనలు. వాగ్దానభంగాలు. మీ మాటలు వింటే నదులు వెనక్కు ప్రవహిస్తాయని కూడా నమ్మమంటారు. స్వేచ్ఛగా తిరగటానికి అలవాటు పడ్డ మాలాంటి వాళ్ళు రిజర్వేషన్లలోనే సుఖంగా వుంటారని అంగీకరించమంటారు. మేం సంచార జీవులం. ఒక్కో దగ్గర స్థిరంగా వుండటం మా స్వభావానికే విరుద్ధం.

మీ నుండి మేమేమీ ఆశించటం లేదు. మాకు స్వేచ్ఛగావాలి. స్వేచ్ఛ అంటే మరో మనిషి ఆంక్ష లేకుండా ఇష్టం వచ్చినట్లుగా తిరగటం, ఇష్టం వచ్చినపని చెయ్యటం, ఇష్టం వచ్చిన వ్యాపారం చేసుకోవటం, ఇష్టానుసారం పూర్వీకుల మతాచారాలను పాటించటం. ఇవన్నీ నాకిచ్చే ఏ చట్టమైనా నాకిష్టమే. వీటికోసం ఏచట్టాన్నైనా వుల్లంఘిస్తాను. అది నేరం అని మీరంటే, ఆ నేరమే మళ్లీ మళ్లీ చేస్తాను".

కానీ, ఈ మాటలు వాషింగ్టన్‌లో ఎవరి గుండెలూ కరిగించలేదు. జోసెఫ్‌ను తిరిగి ఇండియన్ టెరిటరీకి పంపించారు. అక్కడే అతడు 1885 దాగా గడిపారు. అప్పటికి 287 మంది నెజ్‌పెర్స్ మాత్రమే సజీవంగా వున్నారు. అందులో ఎక్కువ మంది చిన్న పిల్లలు. వాళ్ళకు స్వేచ్ఛా జీవితమంటే ఏమిటో తెలియదు. ఉన్న కొద్ది మంది వృద్ధులూ జవసత్వాలుడిగి, యునైటెడ్ స్టేట్స్ అధికారాన్ని అంగీకరించక తప్పలేదు. మరి కొంత మంది లాప్యామ్‌కు వెళ్లటానికి అనుమతించారు".

శాంతిభద్రతలకు ప్రమాదం కలిగించే వ్యక్తులుగా పరిగణించిన జోసెఫ్‌నూ మరో 150 మందినీ ప్రభుత్వం, వాషింగ్టన్‌లోని కాల్విల్ వద్ద వున్న రిజర్వేషన్‌లో బంధించింది. అక్కడే, 1904లో సెప్టెంబర్ 21 నాడు మరణించాడు జోసెఫ్. డెత్ సర్టిఫికెట్‌లో కారణం "బ్రోకెన్ హార్ట్" అని నమోదుచేశారు.

షెయెనీ ప్రస్థానం

"దక్షిణంగా వెళ్ళిన మేము పడరాని కష్టాలు పడ్డాం. అనేకులు కొత్త రోగాలతో (వాటి పేర్లు కూడా మాకు తెలియవు) మరణించారు. పుట్టి పెరిగిన ఈ నేల మీదే మా బతుకంతా గడపాలని తపించాం. ఇప్పుడు మా సంఖ్య కూడా తగ్గింది. కొద్ది పాటి భూమి చాలు. తెల్లవాళ్ళ దాడుల నుండి రక్షించుకోవటానికి -రాత్రికి రాత్రే నివాసాలు విడిచి అడవి దారి పట్టాం. కాని సైనికులు మమ్మల్ని అక్కడ కూడా ప్రశాంతంగా బతకనివ్వలేదు. యుద్ధం మాకిష్టంలేదని నెత్తీ నోరూ కొట్టుకొని బతిమాలుకున్నాం.

"మమ్మల్నీ వుత్తర దిశగా పోనివ్వండి. మేం ఎవ్వరికీ ఏ అపకారమూ చెయ్యలేదు. చంపవద్దు" అని వేడుకున్నాడు. కాని తుపాకీ గుళ్ళతో సమాధానం చెప్పారు వాళ్ళు. అలా, యుద్ధం చెయ్యక తప్పని పరిస్థితి సృష్టించారు. అప్పుడు కూడా మేం అమాయకులను చంపలేదు. నా సోదరుడు, డల్‌నైఫ్, మాలోని సగం మందితో ఫోర్ట్ రాబిన్సన్ వద్ద లొంగిపోయాడు. కాని వాళ్లను నిరాయుధులను చేసి మరీ చంపారు సైనికులు"

ఉత్తర షెయెనీలకు చెందిన
ఆకంగాచె (లిటిల్ వూల్ఫ్)

"జీవించే హక్కు కోసమే పోరాడుతున్నాం. ప్రభుత్వం ఆదేశాల్ని మేమెప్పుడూ వుల్లంఘించ లేదు. గ్రేట్ ఫాదర్ ఆజ్ఞ ప్రకారం దక్షిణంగా కదిలివెళ్లాం. అక్కడ బతకటం అసాధ్యం. అయినా, వెళ్లాం గదా! కనిపిస్తే చాలు కాల్చేస్తామంటే మేమెక్కడ వుండాలి మరి? మా తెగలను తుడిచిపెట్టటమే మీ లక్ష్యమా? మీరు తుపాకులతో వస్తే మేం కర్రలతో ఎదుర్కొన్నా నేరమవుతుందా?

ఉత్తర షెయెనీల తామెలా పాహ్మె
(డల్‌నైఫ్)

"ఇండియన్లలో షెయెనీలదే అత్యుత్తమ తెగ"

- త్రీ ఫింగర్స్ (కల్నల్ రానాల్డ్ ఎస్ మెకెంజీ)

1877 "మూన్ ఆఫ్ గ్రీనింగ్ గ్రాస్" సీజన్‌లో తన ఓగ్లాలా సియోలతో కలిసి లొంగిపోవటానికి ఫోర్ట్ రాబిన్సన్ చేరుకున్నాడు క్రేజీ హార్స్. అప్పటికే, వివిధ తెగలకు చెందిన షెయెనీలు గుర్రాలనూ, ఆయుధాలనూ వదిలి సైనికుల అధీనంలో బతుకుతున్నారు. వీళ్లలో, లిటిల్ వూల్ఫ్, డల్‌నైఫ్, స్టాండింగ్ ఎల్క్, వైట్ హాగ్ ముఖ్యులు. ఈ ఇండియన్ల సంఖ్య అప్పటికి వెయ్యి దాటలేదు. లిటిల్ బిగ్‌హార్న్ యుద్ధం తర్వాత టూమూన్, మరో 35 మంది షెయెనీలతో కలిసి టంగ్ రివర్ వద్ద వున్న ఫోర్ట్ కియోగ్‌లో బేర్ కోట్ మైల్స్ ముందు లొంగిపోయాడు.

ఫోర్ట్ రాబిన్సన్‌కు చేరిన షెయెనీలు, 1868 నాటి ఒప్పందం ప్రకారం (లిటిల్ వూల్ఫ్, డల్ నైఫ్ దీని మీద సంతకాలు పెట్టారు) సియోలతో కలసి రిజర్వేషన్‌లో వుండవచ్చు ననుకున్నారు. కాని, అందులో వున్న మరో షరతు ప్రకారం, ఉత్తర షెయెనీలు తమ సోదరులైన దక్షిణ షెయెనీలతో కలసి జీవించటానికి ఇండియన్ టెరిటరీకి వెళ్లక తప్పదన్నాడు (ఇండియన్ బ్యూరో) ఏజెంట్.

"బ్లాక్ హిల్స్‌కు సమీపంలో వుండాలనుకున్నాం. కాని ఒక నాయకుడు స్టాండింగ్ ఎల్క్, తెల్లవాళ్ళ నిర్ణయమే సరైందని వాదించాడు. వాళ్ళ పలుకుబడి పెంచుకోవడం ఆయన వుద్దేశం కావచ్చు. ఆయన మాటలు మాకు నచ్చలేదు" అన్నాడు వుడెన్ లెగ్.

ఈ వుత్తర షెయెనీలను ఎక్కడికి తరలించాలని ఏజెంట్లు తర్జన భర్జన పడుతున్నప్పుడు, వాళ్ళలో కొందర్ని గూఢ

ఇండియన్ టెరిటరీకి చేయబోయే ప్రయాణంలో వైట్‌హ్యాట్ తమ వెంట వుంటే బాగుంటుందన్నారు షెయెనీలు. కాని అతడికి మరో డ్యూటీ అప్పగించి లెఫ్టినెంట్ హెన్రీ డబ్ల్యు. లాటన్‌ను ఎస్కార్టుగా పంపారు అధికారులు (ఇండియన్లు లాటన్‌కు పెట్టిన పేరు లాట్‌వైట్ మాన్). "అతడు మంచి వాడే". వృద్ధులనూ, పిల్లలనూ వ్యాగన్లలో కూర్చోవటానికి అనుమతించాడు. రాత్రివేళ టెంట్లలో వెచ్చగా పడుకోమన్నాడు. బ్రెడ్లు, మాంసం, కాఫీ, చక్కర అందరికీ సమంగా పంచాడు.

చారులుగా, వలంటీర్లుగా నియమించి (ఇతర తెగలను వేటాడటానికి) సమస్యలు పరిష్కరించారు సైనికాధికార్లు.

ఒక కెవల్రీ లెఫ్టినెంట్ విలియం పి. క్లార్క్ ప్రత్యేకంగా తన కోసం పని చెయ్యమని లిటిల్ వూల్ఫ్‌ని కోరాడు. డ్యూటీలో వున్నప్పుడు వైట్‌హ్యాట్ పెట్టుకోవటం క్లార్క్ అలవాటు. అందువల్ల షెయెనీలు అతడికి పెట్టిన పేరు వైట్‌హ్యాట్, ఈ వైట్‌హ్యాట్‌కు ఇండియన్లంటే ఇష్టం. వాళ్ల జీవిత పద్ధతుల్ని, సంస్కృతి, భాష, మతం, ఆచార వ్యవహారాలు - అన్నీ అతడు గౌరవించాడు (ఇండియన్ లాంగ్వేజీ మీద ఒక పరిశోధనాత్మక గ్రంథం ప్రచురించాడు క్లార్క్).

ఫోర్ట్ రాబిన్సన్‌లో వైట్ హ్యాట్ కలిసి వుండాలనుకున్నాడు లిటిల్ వూల్ఫ్. కాని షెయెనీలంతా ఇండియన్ టెరిటరీకి వెళ్లక తప్పదని తెలిసి తన వాళ్లతో వుండటమే శ్రేయస్కరమనుకున్నాడు. అంతే, ఇండియన్ టెరిటరీలో పరిస్థితులెలా ఉన్నాయో ఎవరికీ తెలియదు. షెయెనీలు, త్రీస్టార్స్ క్రూక్‌తో సమావేశం జరిపారు. "మొదట అక్కడికి వెళ్లి చూడండి. నచ్చకపోతే తిరిగి వద్దురు గాని" అన్నాడు క్రూక్.

ఇండియన్ టెరిటరీకి చేయబోయే ప్రయాణంలో వైట్‌హ్యాట్ తమ వెంట వుంటే బాగుంటుందన్నారు షెయెనీలు. కాని అతడికి మరో డ్యూటీ అప్పగించి లెఫ్టినెంట్ హెన్రీ డబ్ల్యు. లాటన్‌ను ఎస్కార్టుగా పంపారు అధికారులు (ఇండియన్లు లాటన్‌కు పెట్టిన పేరు లాట్‌వైట్ మాన్). "అతడు మంచి వాడే". వృద్ధులనూ, పిల్లలనూ వ్యాగన్లలో కూర్చోవటానికి అనుమతించాడు. రాత్రివేళ టెంట్లలో వెచ్చగా పడుకోమన్నాడు. బ్రెడ్లు, మాంసం, కాఫీ, చక్కర అందరికీ సమంగా పంచాడు.

ఇంకా వుంది....

చందు

ప్యాంటుకు చీరకడితే! అదేనండీ... అబ్బాయిని అమ్మాయిగా సింగారిస్తే... ఈ సందర్భం గుర్తుకొస్తే చాలు నరేష్ కళ్ళ ముందు మెరుపులా మెదులుతాడు కదూ. ఎందుకంటే 'చిత్రం భళారే విచిత్రం'లో ఆయన అమ్మాయిలా అలరించిన వైనం ఎప్పటికీ మర్చిపోలేం. నడకలోనూ... నడతలోనూ... హావ భావాల వ్యక్తీకరణలోనూ... అచ్చు గుద్దినట్లు అమ్మాయే కనిపించింది. కథానాయకుడిగా హాస్య రసాన్ని అందించారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా వినోదాన్ని పంచుతున్నారు. 80 పైగా సినిమాల్లో హీరోగా నటించిన నరేష్ చెబుతున్న ఆసక్తికర సినిమా కబుర్లు...



ఎలా రిసీవ్ చేసుకుంటారోనని తెగ భయపడ్డా....

మధ్యతరగతి ఆలోచనల నడుమ పెరిగాను

1963 జనవరి 20న మద్రాస్‌లో పుట్టాను. అమ్మ నన్ను చిన్నప్పటి నుంచీ మధ్యతరగతి ఆలోచనల నడుమ పెంచింది. సినిమా వాతావరణం నాపై పడకూడదన్న భావనతో ఉండేది. అమ్మకు గార్డెనింగ్ హాబీ. మద్రాస్‌లో ఉన్నప్పుడు కూడా చిన్న తోటను మెయిన్‌టేన్ చేసేది. ఆ తోటలో నాక్కూడా కొంత జాగా ఇచ్చి చెట్లు పెంచమనేది. సెలవుల్లో ఇంట్లో ఉండనిచ్చేది కాదు. తెలుగోళ్ళు ఎక్కువగా ఉండే మణిమంగళ్ గార్డెన్(మద్రాస్ లోనే)కు పంపించేసేది. దీనికి పక్కనే చిన్న గ్రామం ఉండేది. ఆ ప్రాంతంలో కలియతిరగడం వల్ల 'వ్యవసాయం' అంటే ఏమిటో తెలిసింది. బండలు లేపి తేళ్ళు చూడడం... తోట బావిలో ఆడుకోవడం... చెట్ల కిందే పడుకోవడం... ఇలా హాలిడేస్ అంతా హ్యాపీగా సాగాయి. ఓ రోజు చెట్టు కింద పడుకుంటే మామిడి పండు పడింది. ఆ పండు తీపి ఇప్పటికీ మర్చిపోలేను. చిన్నప్పుడే గ్రామీణ వాతావరణం అంటే ఏమిటో... సిటీ కల్చర్ ఎలా ఉంటుందో... తెలుసుకున్నాను. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఈ రోజు పిల్లలకు బావులంటే ఏమిటో తెలీని పరిస్థితి. సిటీ లైఫ్‌లో ఎక్కడ చెడిపోతానేమోనని అమ్మ పాకెట్ మనీ కూడా ఇచ్చేది కాదు. స్ట్రిక్ట్‌గా పెంచేది. ఎందుకింత కఠినంగా ఉంటున్నారని బాధ పడేవాణ్ణి. ఈక్రమంలో ఐదో తరగతి చదువుతుండగా నా పాకెట్ మనీ సొంతంగా సంపాదించుకోవడం మొదలుపెట్టాను. అమెరికాలో స్టూడెంట్స్ పాకెట్ మనీని కష్టపడి సొంతంగా సంపాదించుకునేవారని వినేవాళ్ళం. ఆ స్ఫూర్తితో నలుగురైదుగురు పిల్లలు కలిసి లైబ్రరీ పెట్టాం. కామిక్ బుక్స్ రెంట్‌కి ఇచ్చేవాళ్ళం. అప్పట్లో రేడియో ఒక్కటే ఎంటర్‌టైనర్ కావడంతో లైబ్రరీ బాగానే సాగింది. సొంతంగా కష్టపడి సంపాదించుకోవడం అమ్మకు ఆనందం కలిగించేది. కొడుకు చెడిపోకూడదన్న ముందు చూపుతో పాకెట్ మనీ ఇవ్వలేదన్న సత్యం పెద్దయిన తర్వాత గ్రహించాను.

కారు పక్కన పెట్టి సైకిల్ తీశా

బాల్యాన్ని ఎంతగా ఎంజాయ్ చేసినా... తోటి స్టూడెంట్స్‌తో కొంత ఇబ్బంది ఎదుర్కొనేవాణ్ణి. స్కూల్ మొత్తం మీద ఇద్దరో ముగ్గురో కార్లో వచ్చేవారు. అందులో నేనూ ఒకడిని. జలసీయో..!, సినిమా వాళ్ళతో తిరిగితే చెడిపోతారన్న భావనతో, మాతో మాట్లాడొద్దని ఇంట్లో పేరెంట్స్ చెప్పేవారేమో! తెలీదు. ఏ ఉద్దేశంతో నన్ను దూరంగా పెడుతున్నారో అర్థమయ్యేది కాదు? సినిమా ఫ్యామిలీ నుంచి రావడం వల్లే ఏడిప్పిస్తున్నారా?! ఇదంతా జీర్ణించుకోవడం నాకు కష్టంగా అనిపించింది. మనసుకు చాలా బాధనిపించింది. నాణానికి బొమ్మాబొరుసులా అక్కడా మంచివాళ్ళున్నారు. ఇద్దరు మంచిగా ఉంటే, మరొకరు మరోలా ఉండేవారు. మధ్య తరగతి ఆలోచనలతో పెరగడం వల్ల అందరితో కలిసిపోవాలనిపించేది. ఆరో తరగతిలో స్కూల్ మారినపుడు కారు పక్కన పెట్టి సైకిల్ మీద వెళ్ళడం మొదలు పెట్టాను.

సినిమా వాళ్ళను ఇంతగా ఇష్టపడతారా!

మా వీధిలో 20 ఇళ్ళుండేవి. ఇద్దరే సినిమా ఆర్టిస్టులు. ఒకరు అమ్మ, మరొకరు హీరోయిన్ రాజేశ్వరిగారు. మమ్మల్ని చూడడానికి తిరుపతి నుంచి గుండులేసుకుని వచ్చేసే వాళ్ళు. రాజేశ్వరిగారిని కలిసి మా ఇంటి కొచ్చేవాళ్ళు. ఇంతమంది మా ఇంటికే ఎందుకొస్తున్నారో చిన్న వయసులో తెలిసేది కాదు. సినిమా వాళ్ళని ఇంతగా ఇష్టపడతారా? ఇంతగా ఆదరిస్తారా? అనిపించింది. సినిమా వాళ్ళకున్న క్రేజ్ ఎలాంటిదో క్రమంగా అర్థమైంది. ఆహా! సినిమాలో నటిస్తే మనకూ క్రేజ్ వస్తుంది కదా! అన్న భావన మనసులో నిలిచింది.

ఆసుపత్రి హోటలైంది

చిన్నప్పటి నుంచీ చదువులో వీకే. అలాగే సినిమాల్లో యాక్ట్ చేయాలన్న కోరిక ఎక్కువే. కానీ మా అమ్మ పక్కా విరుద్ధం. నన్ను డాక్టర్‌గా చూడాలనుకునేది. అందుకే అప్పట్లోనే మా ఇంటి ఎదురుగా ఉన్న బిల్డింగ్ కొన్నది. 'ఎప్పటికైనా దీన్ని ఆసుపత్రి చేసి, నువ్వు వైద్యం చేస్తుండగా చూడాలి' అనేది. ఐదో తరగతిలో ఉండగా సొంతంగా నాటకాలు రాసుకుని... పిల్లలకు నేనే మేకప్ వేసి... స్టేజ్ ఎక్కించి నాటకాలాడించేవాణ్ణి. పావలా టిక్కెట్ పెట్టేవాళ్ళం. పిల్లలు నటిస్తున్నారు. ఎలా చేస్తున్నారో చూద్దామన్న ఆసక్తితో పక్క వీధి నుంచి చూడడానికి వచ్చేవాళ్ళు. వచ్చిన డబ్బును చెరి కాస్తా పంచుకునేవాళ్ళం. ఇదంతా అమ్మకు నచ్చేది కాదు. 'నువ్వెందుకు ఈ దారిలో పోతున్నావ్...!' అని కోప్పడేది.

ఏడేళ్ళ వయసులో ప్రభాకరరెడ్డిగారు, అమ్మ కలిసి 'పండంటి కాపురం' తీశారు. ఇంట్లోనే ఆఫీసుండేది. అమ్మ ఔట్ డోర్ షూటింగ్‌కు వెళ్ళింది. నేనేమో రోడ్డు మీద టైర్ కొట్టుకుంటూ ఆడుకుంటున్నాను. దర్శకుడు లక్ష్మీ దీపక్, ప్రభాకర్ రెడ్డిగారు వచ్చారు. నన్ను చూసి 'బాబూ మా సినిమాలో యాక్ట్ చేస్తావా?' అని అడిగారు. సరేనన్నాను. మరి అమ్మకు కూడా ఒకమాట చెబుదామంటే... ఒప్పుకోదు చెప్పొద్దన్నాను. అమ్మకు తెలిసి 'ఏముందీ చైల్డ్ ఆర్టిస్టే కదా....' అని పెద్దగా పట్టించుకోలేదు. అప్పటికే వాళ్ళు ఎంచుకున్న కుర్రాడు సరిగ్గా సెట్ కాకపోవడంతో అవకాశం నన్ను వరించింది. జయసుధ (నాకు కజిన్ అవుతుంది) కూడా ఇదే చిత్రం ద్వారా పరిచయమైంది. నా అదృష్టం ఏమంటే... ఎస్వీ రంగారావు, గుమ్మడి, కృష్ణ, జమున, దేవిక... వంటి సీనియర్ నటీనటులతో కలిసి తొలి చిత్రంలో నటించడం జాతీయ అవార్డు వచ్చిన దానికంటే ఎక్కువగా భావిస్తా. సంతానం, సౌభాగ్యం, కవిత వంటి చిత్రాల్లో బాల నటుడిగా నటించినా... సినిమా ప్రభావం పడకూడదని దూరంగా పెట్టేవారు. కాలక్రమంలో నటనపై నాకు

మరింత ఆసక్తి పెరగడంతో ఆసుపత్రి కోసం కొన్న బిల్డింగ్ కాలక్రమంలో హోటల్ అయిపోయిందనుకోండి (నవ్వుతూ).

'సీతాకోక చిలుక' చేజారిన వేళ

ఆనాడు ఐ.ఏ.యస్., ఐ.పి.యస్., ఇంజనీరింగ్, డాక్టర్... గౌరవప్రదమైన ఉద్యోగాలు. అప్పట్లో యాక్టర్ పిల్లలు డాక్టరో, ఇంజనీరో కావాలన్న కాన్సెప్ట్ ఉండేది. ఇప్పటిలా రికమండ్ చేసి ప్రమోషన్ చేసేవాళ్ళు కాదు. ఒకవేళ వేషాలు రాకపోతే ఎక్కడ చెడిపోతానేమోనని అమ్మ భయపడిపోయేది. సినిమాల వైపు రావడానికి ఇష్టపడేది కాదు.

ఎలాగైనా సినిమాల్లో నటించాల్సిందేనన్న నిర్ణయానికొచ్చి హీరాలాల్ మాస్టర్ దగ్గర డాన్స్ నేర్చుకున్నాను. భరత నాట్యం నేర్చుకునేటప్పుడు చెమటకి మూడు, నాలుగు చొక్కాలు తడిసిపోయేవి. బాగా కష్టపడ్డాను. 'సీతాకోక చిలుక'లో అవకాశం వచ్చింది. తొలి అవకాశం రావడం ఆలస్యం ఎగిరి గంతేసి స్నేహితులందరికీ చెప్పేశా. అమ్మకు చెబితే గర్వంగా ఫీలైంది. ఫొటో సెషన్ చేశారు. బాగుందన్నారు. చిత్ర నిర్మాత ఏడిద నాగేశ్వరరావుగారి అబ్బాయి ఏడిద రాజా, నేనూ మంచి ఫ్రెండ్స్. భారతీరాజా దర్శకులు. ఓ రోజు ఆఫీసుకెళితే ఏడిద నాగేశ్వరరావుగారు అదోలా ఉన్నారు. ఎక్కడ వేషం పోయిందేమోనని భయమేసి ఏమైందిరా!? అని రాజాని అడిగితే.... 'ఏం లేదురా' అన్నాడు. ఇదే చిత్రాన్ని తమిళంలో కార్తీక్ హీరోగా భారతీరాజాగారు తీసివున్నారు. 'ఆల్‌రెడీ కార్తీక్‌తో చేశాను కాబట్టి అతనైతే బాగుంటుంది. అరవబ్బాయి కావడంతో భాషపరంగా నాకూ కంఫర్టబుల్‌గా ఉంటుంది' అని భారతీరాజాగారు అన్నారట. వేషం చేజారిపోయిందని తెలిసి చాలా అప్‌సెట్ అయ్యాను. అమ్మకు ఏం చెప్పాలి? స్నేహితులకు నా మొహం ఎలా చూపించాలి? పెద్ద అవమానం. దిగులుతో రూం తలుపులు వేసేసుకుని రోజంతా ఒక్కడినే ఉండిపోయాను. నా బాధ చూడలేక కృష్ణగారు 'నేనే నిన్ను ఇంట్రడ్యూస్ చేస్తా'నన్నారు. ఓ సినిమా రైట్స్ కూడా కొన్నారు. సినిమా ఎనౌన్స్ చేశారు. ఈలోగా 'ముద్ద మందారం' సినిమా ఆఫర్ వచ్చినట్లే వచ్చి చేజారింది. నేను ఫిట్ కానేమో! అన్న భయం కలిగింది. నేనొక డాన్స్ క్లాస్‌లో ఉండగా కె. విశ్వనాథ్‌గారు, జంధ్యాలగారు నన్ను చూశారట. నేనైతే 'నాలుగు స్తంభాలాట'కు బాగుంటానని దర్శకులు జంధ్యాలగారు భావించి నన్ను కథానాయకుణ్ణి చేశారు. దీనికి నిర్మాత నవతా కృష్ణంరాజుగారు. మంచి సంస్థలో అవకాశం వచ్చినందుకు అమ్మ సంతోషించింది. సొంతంగా తీద్దామనుకున్న సినిమాను రెండో చిత్రంగా వాయిదా వేసింది. జంధ్యాల వంటి గొప్ప దర్శకుని వద్ద నటించడం అదృష్టంగా భావిస్తాను. నేను చిన్నప్పటి నుంచీ బాగా నవ్వేవాణ్ణి... నవ్వించేవాణ్ణి. నటుడిగా నాకిష్టమైన హాస్య రసానికి జంధ్యాలగారు పునాది వేశారు. 17 ఏట హీరో అయ్యాను.

తొలి సంపాదన జమా ఖర్చులు

'నాలుగు స్తంభాలాట' విడుదలకు సిద్ధమైంది. రెమ్యునరేషన్ ఇవ్వలేదు. 'నటించే అవకాశం కల్పించారు. రెమ్యునరేషన్ అడగొద్దు. పెద్ద నిర్మాత కదా! ఆయనే ఇస్తారు' అని అమ్మంది. ఏంటీ... ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. తొలి రెమ్యునరేషన్ కింద రూపాయి ఇచ్చినా ఆనందపడేవాణ్ణి కదా! అనుకున్నాను. సినిమా రిలీజై సూపర్ హిట్ అయింది. నవతా కృష్ణంరాజుగారు ఫోన్ చేసి 'అబ్బాయ్... సినిమా హిట్ అయిపోయింది. నీకు మంచి పేరొచ్చింది. మరిన్ని సినిమాలొస్తాయి' అన్నారు. రెమ్యునరేషన్ గురించి మాట్లాడలేదు. సరిగ్గా వారం తర్వాత ఆయన మా ఇంటికొచ్చారు. 'తెలుగు బాగా నేర్చుకోవాలబ్బాయ్. నీ యాక్టింగ్ బాగుంది. మోటార్ సైకిల్ ఫీట్ అందరికీ తెగ నచ్చింది' అని ఓ పది నిముషాలు మాట్లాడి, 'ఏమీ అనుకోకపోతే' అంటూ రెమ్యునరేషన్ కింద 10 వేలు ఇచ్చారు. 1982లో 10 వేలంటే ఇప్పటి ప్రకారం ఐదు లక్షలు కంటే ఎక్కువే. అందులోంచి మూడు వేలతో హెరాల్డ్ కారు కొనుక్కున్నాను. 1500 పెట్టి ఎ.సి పెట్టించుకున్నా. 500 రూపాయిలతో ఫ్రెండ్స్‌కి పార్టీ ఇచ్చా. మిగతా ఐదు వేలు బ్యాంక్‌లో దాచుకున్నా. ఇది నా మొదటి సంపాదన జమాఖర్చుల వివరాలు.

మద్రాసులో పుట్టి పెరగడంతో ఇప్పటిలా తెలుగు మాట్లాడడం వచ్చేది కాదు. ఒత్తులు సరిగ్గా పలికేవాణ్ణి కాదు. జంధ్యాలగారు నాతో డబ్బింగ్ చెప్పించి చూశారు. బాగోలేదన్నారు. అమ్మ దగ్గరికొచ్చి 'ఒక విషయంలో మీ సలహా తీసుకుందామని వచ్చాను. మీ అబ్బాయి మంచి నటుడు. ఈజ్ ఉంది. నరేష్ డబ్బింగ్ చెబితే సినిమా హిట్ అవుతుంది. ఇండస్ట్రీలో అతను రెండు, మూడేళ్ళ వరకూ నిలబడతాడు. బాలుగారితో డబ్బింగ్ చెప్పిస్తే... 10 ఏళ్ళ వరకూ కెరీర్ బాగుంటుందని నేను గ్యారెంటీ ఇస్తాను. మీరేది చెబితే అది చేస్తాను' అన్నారు. మహాపండితులు జంధ్యాలగారు ఇంతలా చెబుతున్నారంటే... ఆలోచించే చెబుతారు కదా అనుకుని, బాలుగారితోనే డబ్బింగ్ చెప్పించమంది. బాలుగారు నా చిన్నప్పటి నుంచీ ఫ్యామిలీ ఫ్రెండ్. 'నాలుగు స్తంభాలాట' డబ్బింగ్ చెప్పి 'బాగా నటించావయ్యా... నువ్వు తెలుగు బాగా మాట్లాడినపుడు నాకు చాలా గర్వంగా ఉంటుం దయ్యా....' అని ఆశీర్వదించారు. పది, పదిహేను సంవత్సరాల తర్వాత బాలుగారు నా లైఫ్‌లో మర్చిపోలేని కాంప్లిమెంట్ ఇచ్చారు. 'నీలా తెలుగు మాట్లాడే హీరో చాలా తక్కువ మంది ఉన్నారయ్యా...' అనడం మరో నేషనల్ అవార్డు వచ్చినట్లు భావించాను.

లేడీ గెటప్‌తో అద్దం ముందు కూర్చుంటే....

స్కూల్‌డేస్‌లో ఓసారి ఫ్యాన్సీ డ్రస్ కాంపిటేషన్. అమ్మ నాతో అమ్మాయి వేషం వేయించింది. కృష్ణగారి పర్సనల్ మేకప్‌మేన్ మాధవరావుగారు, అమ్మ కలిసి మేకప్ చేశారు. అమ్మాయిని చేసేశారు. 'అచ్చు గుద్దినట్లు అమ్మలా ఉన్నావ్' అంటూ తెలుగు మాస్టర్లు అందరూ కలిసి నాతో ఫొటో తీయించుకున్నారు. యాక్టర్ అయితే లేడీ గెటప్ వేయాలన్న బీజం అప్పుడే పడింది. నటించడం మొదలుపెట్టాక ఓ ఇంగ్లీష్ చిత్రం చూశాను. అందులో హీరో లేడీ గెటప్‌లో కనిపిస్తాడు. ప్రింట్ గుద్దినట్లు అమ్మాయిలా ఉన్నాడే! అని ఆశ్చర్యపోయాను. ఆ సినిమా ప్రభావం నాపై బాగా పని చేసింది. ఇదే స్క్రిప్ట్‌ను పలువురు దర్శకనిర్మాతల ముందుంచితే... 'పూర్తి

'చిత్రం భళారే విచిత్రం'లో నరేష్

నిడివితో అమ్మాయి పాత్రంటే రిస్క్ అవుతుంది. వద్దు' అన్నారు. గురువుగారు జంధ్యాలగారిని సంప్రదిస్తే... 'చేద్దాంగానీ... మొదట్లోనే పూర్తి నిడివి వేషం వద్దు. ముందు ఒక సాంగ్‌లో లేడీ గెటప్ వేద్దాం. ఎలా ఉంటావో! ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో! చూద్దాం. ఇది క్లిక్ అయితే ప్రొసీడ్ కావొచ్చు' అన్నారు. దాని రిజల్టే 'చూపులు కలిసిన శుభవేళ'లో సుత్తి వీరభద్రరావుగారు, నా(లేడీ గెటప్)పై వచ్చే డ్యూయెట్. లేడీ గెటప్‌కి మంచి పేరొచ్చింది. ఇక ఫుల్ లెంగ్త్ లేడీ గెటప్‌కి ప్లాన్ చేస్తున్నాం. దర్శకుడు మౌళిగారిని కలిసి చెబితే... చేద్దామన్నారు. ఈలోగా దర్శకుడు పి.ఎన్. రామచంద్ర వచ్చారు. ఓ మరాఠీ సినిమా గురించి చెప్పారు. వర్కవుట్ చేశాం. అదే 'చిత్రం భళారే విచిత్రం'. అందులోని లేడీ గెటప్‌తో అద్దం ముందు కూర్చుంటే... నాలో మా అమ్మను చూసినట్లుంది.

సినిమా పూర్తయిందిగానీ, అమ్ముడుపోలేదు. 'ఆఁ మగాణ్ణి ఆడదాని గెటప్‌లో ఎవరు చూస్తారు? ఇదేం సినిమా?' అన్నవారు లేకపోలేదు. ఎట్టకేలకు సినిమా రిలీజైంది. నేనూ, మా ఆవిడ సినిమా చూస్తానికి థియేటర్‌కి వెళ్ళాం. ఫస్టాఫ్ అయింది. సెకండాఫ్‌లో లేడీ గెటప్ ఎంటరయ్యే సరికి జనాలు చిల్లర డబ్బులు విసరడం మొదలుపెట్టారు. ఆనందం తట్టుకోలేక ఒక్కసారిగా ఏడ్చేశాను. లేడీ గెటప్‌ను ఎలా రిసీవ్ చేసుకుంటారో! అని తెగ భయపడిపోయిన నేను, ప్రేక్షకుల కేరింతల మధ్య ఊపిరి పీల్చుకున్నాను.

ఓ రోజు ఆఫీసులో కృష్ణగారు, నేను మాట్లాడుకుంటున్నాం. ఇంతలో ఎం.ఎస్. రెడ్డిగారు వచ్చారు. కృష్ణగారు ఓ మ్యాగజైన్‌పై వచ్చిన నా ముఖ చిత్రం ('చిత్రం భళారే విచిత్రం'లోని లేడీ గెటప్) ఆయనకు చూపించి 'ఈ అమ్మాయి ఎలా ఉంది' అని అడిగారు. 'బాగుందయ్యా... హీరోయిన్‌గా పనికొస్తుంది. ఎక్కడమ్మాయ్? ఉత్తరాది అమ్మాయా? విజయనిర్మల పోలికలు కనబడుతున్నాయ్. ఆమెకు ఈవిడ బంధువా? ఏంది?' అన్నారు. కృష్ణగారు పకపకా నవ్వి 'మన నరేష్' అన్నారు. 'నువ్వా! నువ్వేందయ్యా... ఇంత అందంగా ఉన్నావ్. చూస్తే నాకే చపలం వచ్చింది' అని ఎం.ఎస్. రెడ్డిగారు ఆశ్చర్యపోయారు. అలాగే ఓ ప్రొడ్యూసర్ కూడా మోసపోయి నా నైట్ రేట్ ఎంతో కనుక్కోమన్నాడట.

మరిన్ని కబుర్లు వచ్చే వారం....

చల్ చల్ గుర్రం

నేస్తాలూ... ఏంటి మాంచి హుషారుగా కనిపిస్తున్నారు. ఇవాళ కొత్తగా చెప్పబోయే బొమ్మ గురించి ... తొందర తొందరగా తెలుసుకుందామనే కదూ మీ హుషారు. సరేగాని డైరెక్టుగా విషయంలోకి వెళ్లిపోతే బావుంటుంది కదా.

చేసేద్దాం.

ఇవన్నీ కావాలి మరి...

ఐస్ క్రీమ్ పుల్లలు -5, అగ్గిపెట్టెలు -2, తెల్ల కాగితం, స్కెచ్ పెన్నులు, చిన్న కత్తెర, గమ్.

ఇలా చేయాలి సుమా...

ముందుగా తెల్ల కాగితం మీద గుర్రం జూలు, చెవులు, తోక ఆకారం గియ్యండి. వీటిని కత్తిరించి పక్కన పెట్టుకోండి. మిగతా తెల్లకాగితాన్ని రెండు అగ్గిపెట్టెల చుట్టూ అతికించండి. ఒక అగ్గిపెట్టె మీద గుర్రం ఆకారం గియ్యండి. గుర్రం మీద ఎక్కి కూర్చునే చోట జీను వుంటుంది కదా. అది కూడా గియ్యాలి. ఒక చివరన మనం ముందుగా రెడీ చేసుకొన్న గుర్రం తోకను అతికించండి. మరో అగ్గిపెట్టె తీసుకొని గుర్రం మొహం గియ్యండి. తర్వాత కాగితం చెవులను దీనికి అతికించండి. ఇప్పుడు నాలుగు ఐస్‌క్రీమ్ పుల్లలు తీసుకొని రంగులు వేయండి. మరి గుర్రం కాళ్లలాగా కనపడాలికదా. వీటిని జీను వేసిన అగ్గిపెట్టె కింది భాగంలో అతికించాలి. ఐదవ ఐస్‌క్రీమ్ పుల్లను బొమ్మలో చూపించినట్టుగా అగ్గిపెట్టెకు పైకి వచ్చేలా అతికించాలి. గుర్రం మెడ ఇదేనన్నమాట. ఇందాక పేపర్ మీద జూలు బొమ్మ వేసి కత్తిరించి పెట్టుకున్నాం కదా. దాన్ని ఇప్పుడు ఈ మెడకు అతికించాలి. దీనికి ముందువైపు.... గుర్రం మొహం గీసిన అగ్గిపెట్టె అతికించండి. అంతే అందమైన గుర్రం రెడీ. దీన్ని షోకేస్‌లో పెడితే ఎంత అందంగా వుంటుందో చెప్పలేం. చూస్తే మీకే తెలుస్తుందిగా!



-సాహిల్

వరుసక్రమంలో రాయండే

ఫ్రెండ్స్! కింద 12 పదాలున్నాయి.
మీరు గమనించారో లేదో ఏ రెండు పదాల తొలి అక్షరమూ ఒకటి కాదు.
ఇప్పుడు మీరేం చేయాలంటే... వీటిని ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో (ఆంగ్ల అక్షరమాల ప్రకారం) రాయాలి. ఓకే కదా.

flowers	mug	ears	book
saucer	apple	gun	knife
basket	gift	hat	lamp

1 ________ 7 ________
2 ________ 8 ________
3 ________ 9 ________
4 ________ 10 ________
5 ________ 11 ________
6 ________ 12 ________



జవాబు: apple, basket, book, ears, flowers, gift, gun, hat, knife, lamp, mug, saucer.

రంగులు పులిమేద్దాం

దారి కనిపెట్టండి చూద్దాం



S	J	U	M	P	E	D	Q
T	K	N	O	C	K	E	D
O	S	T	U	B	V	W	X
M	A	S	H	A	R	E	D
A	B	P	A	S	S	Y	Z
C	L	O	C	K	E	D	F
H	O	U	S	E	C	D	E
P	I	C	K	T	R	A	N

పది పదాలను గుర్తించాలోచ్

హాలో...పిడుగులూ! పై బాక్సులో బోలెడన్ని అక్షరాలున్నాయికదా. ఇందులో పది పదాలు దాక్కున్నాయి. వీటిని ఆ అక్షరాల్లో వెతికి పట్టుకోవాలి. అంతటితో మీ పని అయిపోదు. పెన్నో పెన్సిల్లో తీసుకొని సున్నా చుట్టాలి. మరి ఆ పదాలు ఏంటంటే...

1)Basket, 2)Pick, 3)Pass, 4)Ran, 5)House, 6)Knocked, 7)Locked, 8)Jumped, 9)Stomach, 10)Shared

రు తేడాలు కనిపెట్టాలి







చుక్కలు కలిపేస్తే సరి

అట్టమీది కథ

కాకర్లమూడి విజయ్

ఎవరెస్ట్ ఎక్కడం ఎంత కష్టమో!

ఎవరెస్ట్...ప్రపంచంలోకెల్లా అత్యున్నత పర్వతం. అప్పటికీ... ఇప్పటికీ... ఎప్పటికీ.... పర్వతారోహకులను ఆహ్వానిస్తూనే వుంది. చిలిపిగా సవాల్ విసురుతూనే వుంది. కవ్విస్తూనే వుంటుంది. దగ్గరకెళ్లేకొద్దీ... పైకి వెళుతున్నకొద్దీ...ఎన్నెన్నో పరీక్షలు పెడుతుంది. వాటన్నిటిలో నెగ్గి...శిక్షరాగ్రభానికి చేరుకోవడం చిన్న విషయం కాదు. కత్తిమీద సాములాంటిది. వాటన్నిటినీ తట్టుకొని ఎవరెస్ట్‌ను అధిరోహించిన వారిని వేళ్లమీద లెక్కించవచ్చు. అసలు ఎవరెస్ట్ శిఖరపు ఎత్తును ఎవరు ఎప్పుడు కొలిచారు? తొలిసారిగా ఎవరు అధిరోహించారు? అక్కడి వాతావరణం ఎలా వుంటుంది? వారు ఎన్ని ఇబ్బందులు పడ్డారు? వంటి ఎన్నో విశేషాలు మీకోసం ప్రత్యేకంగా...

ప్రపంచంలో ఎత్తైన పర్వతాల జాబితా తయారుచేసే పనిమీద ద గ్రేట్ ట్రిగనామెట్రిక్ సర్వే ఆఫ్ ఇండియా అనే సంస్థను బ్రిటీష్‌వాళ్లు ఏర్పరిచారు. ఈ సంస్థ తాలూకు బృందం 1808లో దక్షిణ భారతదేశం నుండి ప్రారంభమై క్రమేపీ ఉత్తరానికి సాగింది. 500 కిలోల బరువున్న థియోడొలైట్లను ఒక్కోదాన్ని మోసుకుంటూ డజనుమంది వెళ్లాల్సి ఉంది. ఈ థియోడొలైట్లతో ఎత్తును కచ్చితంగా లెక్కగట్టవచ్చు.

తొలినామం 'చోమోలుంగ్మా'

ఆ బృందం హిమాలయాల ప్రాంతానికి చేరేసరికి 1830 వ సంవత్సరం వచ్చింది. అంత కష్టపడి వచ్చిన బృందానికి చుక్కెదురైంది. నేపాల్ వాళ్లు బ్రిటీష్ బృందాన్ని తమదేశంలోకి అడుగుపెట్టనీయలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా నేపాలీయులు ససేమిరా అన్నారు. దాంతో, చేసేది లేక నేపాల్‌కి దక్షిణాన వున్న తెరాయ్ నుండి తమ పని ప్రారంభించారు. విపరీతమైన వర్షాలు, మలేరియా తాకిడిని తట్టుకుంటూ, 1847లో హిమాలయ శిఖరాలను పరిశీలించడం మొదలెట్టారు. ఆ రోజుల్లో 'కాంచనగంగ' ప్రపంచంలో అత్యంత ఎత్తైన శిఖరంగా ఉండేది. జాన్ ఆర్మ్‌స్ట్రాంగ్ అనే అతను కాంచనగంగకు వెనక దాదాపు 240 కి.మీ లోపల అంతకంటే ఎత్తైన శిఖరం గమనించాడు. దానికి శిఖరం 'బి' అని పేరు పెట్టాడు. ఆ తరువాత 1849లో జేమ్స్ నికల్సన్ మళ్లీ వేరే చోటినుండి 'బి' శిఖరాన్ని లెక్కగట్టాడు. అలా అతను 90 వేర్వేరు ప్రదేశాల నుండి లెక్కలు వేసి ఆ శిఖరపు ఎత్తు 30, 200 అడుగులని తేల్చాడు.

నికల్సన్ అంచనాల ఆధారంగా, బెంగాల్‌లోని రాధానాథ్ సిక్దర్ అనే గణితపండితుడు ట్రిగనామెట్రీ ఉపయోగించి, 'బి' శిఖరమే ఎత్తైనదని తేల్చేశాడు. ఇంకా అనేక లెక్కల తరువాత, మార్చి, 1856లో అధికారికంగా బి శిఖరం ఎత్తు (అప్పటికి దానిని శిఖరం XV అని కూడా అనేవారు) 29,002 అడుగులు అని ప్రకటించారు. వాస్తవానికి లెక్కల ప్రకారం దాని ఎత్తు 29,000 అడుగులు వచ్చింది. దాంతో కాంచనగంగ ప్రపంచంలో రెండవ ఎత్తైన శిఖరంమైంది.

సరే ఎత్తైన శిఖరం ఏదో నిర్ణయమైపోయింది. మరి దానికి పేరేది పెట్టాలా అన్నది సమస్య. ఎన్నో స్థానిక పేర్లు ఆలోచించారు. ఒక ఫ్రెంచి సర్వేయర్ అయితే ఏకంగా 'చోమోలుంగ్మా' అనే టిబెట్ పేరు పెట్టేశాడు కూడా. కానీ అసలు ఈ లెక్కకట్టే తతంగమంతా ప్రారంభించిన బ్రిటీష్ సర్వేయర్ జనరల్ అయిన ఆండ్రూవా తనకంటే ముందు పనిచేసిన సర్ జార్జ్ ఎవరెస్ట్ పేరు పెట్టాలని నిర్ణయించాడు.

చివరికి 'ఎవరెస్ట్' అయ్యింది

అయితే తన పేరుని హిందీలో రాయడమూ, స్థానిక భారతీయ భాషలో పలకడమూ కష్టమని ఎవరెస్టే వద్దన్నాడు. అయినా 'వా' ఒప్పుకోలేదు. చివరికి 1865లో రాయల్ జాగ్రఫికల్ సొసైటీ అధికారికంగా మౌంట్ ఎవరెస్ట్‌ని ప్రపంచంలో ఎత్తైన శిఖరంగా ప్రకటించింది.

1954లో ఇంకొంత మంది మళ్లీ ఎవరెస్టు ఎత్తు కొలిచారు. అప్పుడు దాని ఎత్తు మరో 26 అడుగులు పెరిగినట్టు కనిపించింది. దాదాపు 100 ఏళ్లలో అంత పెరుగుదల ఉందా? చెప్పడం కష్టం. ఎందుకంటే పర్వతాల ఎత్తులు కొలవడం అతి కచ్చితంగా వుండాలి.



ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గే



సాధనాలతో అయినా సరే చాలా కష్టమైన పని. ఎవరెస్టు ఎత్తు ఏదైనా, ప్రపంచంలో ఈ భూగోళ ఉపరితలంపైన దీన్ని మించిన శిఖరం ప్రస్తుతానికి లేదన్నది సత్యం.

ఏదేమైనా ఎత్తు సాపేక్షికం. న్యూజెర్సీలోని వాఛుంగ్ పర్వతాలు 400-500 అడుగుల ఎత్తుకే మహా పర్వతాల్లా పరిగణించబడతాయి. హిమాలయ శ్రేణుల్లో 12,000 అడుగుల కొండల్ని అక్కడి షెర్పాలే పట్టించుకోరు.

పేరులోనే రెస్ట్...

నీలపు ఆకాశాన్ని తన పదునైన కొనతో గుచ్చుతుందా అనిపిస్తూ వందలాది శిఖరాల మధ్య రొమ్ము విరుచుకుని, గర్వంగా సవాలు విసురుతూ కనిపించే, తనకంటే మరే ఎత్తూ ఎత్తు కాదని అక్కడి నుండి ప్రపంచాన్నంతా కనిపెడుతూ ఉండే హిమోన్నత శిఖరం ఎవరెస్ట్. సముద్రమట్టానికి 8,848 మీటర్లు-29,029 అడుగుల ఎత్తున, నేపాల్ చైనాల మధ్య హిమాలయ పర్వత శ్రేణులలో ఠీవిగా నిలుచున్న శిఖరం ఎవరెస్ట్. తను అందుకున్న ఎత్తులని అందుకోవాలని మానవులు కూడా ప్రయత్నించారు. విజయం సాధించారు కూడా. పేరులో 'రెస్టు' ఉందికానీ, దానిని అధిరోహించాలన్న అసంఖ్యాకులు మాత్రం 'నెవర్ రెస్ట్' అన్నట్టుగా సాగిపోతుంటారు.

రెండేళ్ల క్రితం లెక్కల ప్రకారం 2,436 పర్వతారోహకులు దీనిని ఎక్కారు. అయితే అత్యంత కఠినమైన వాతావరణం 210 మందిని బలిగొన్నా, మిగతా వారిలో ఉత్సాహం ఏమాత్రం సడలలేదు సరికదా మరింత పట్టుదలతో ఎవరెస్ట్ 'అంతు' చూడాలని సన్నద్ధమౌతూనే ఉన్నారు.

తొలిసారి కాలుమోపినవారి వివరాలు...

కానీ ఎవరెస్టు శిఖరంపై మోపిన తొలి కాలు కథ చాలానే ఉంది. అది మార్చి, 1953. జాన్ హంట్ బృందం నేపాల్ చేరింది. ఈ తొమ్మిదవ బ్రిటీష్ పర్వతారోహక బృందానికి లక్ష్యం ఒకటే - ఏదేమైనా సరే ఎవరెస్టు శిఖరంపై కాలు మోపాలి. హంట్‌కి అప్పటికే పర్వతాలపైన, మనుషులపైన (అతను రెండవ ప్రపంచయుద్ధంలో పఠాన్లు, స్కాట్లు, డోగ్రాలు, గుర్ఖాలను నడిపించాడు) ఉన్న అవగాహన, అనుభవం కలిసివచ్చాయి. ఈసారి అధిరోహణ ఒక మిలటరీ కచ్చితత్వంతో జరిగేలా ప్రణాళిక వేశాడు.

హంట్ బృందంతో పాటు వారి సామాన్లు మోయడానికి 350 పోర్టర్లను మాట్లాడుకుని, మార్చి 25న నామ్చె బజార్ అనే షెర్పా పట్టణానికి చేరుకున్నారు అంతా. అక్కడ షెర్పాల దీవెనలు, వాళ్లిచ్చిన కేక్‌లు తీసుకుని థ్యాంగ్‌బోచె చేరారు. అది వాళ్ల మొదటి బేస్ క్యాంపు.

క్రమక్రమంగా ప్రకృతి సవాళ్లను ఎదుర్కొంటూ బృందం 25,850 అడుగుల ఎత్తులో క్యాంప్ 8ని ఏర్పాటు చేసుకుంది. చివరి 3,000 అడుగులు అధిరోహిస్తే చాలు శిఖరం వశమౌతుంది.

హంట్ అద్భుతమైన ప్లానింగ్ లేకపోతే ఆపై ఎగబాకడం మానవమాత్రులకి అసాధ్యం. హంట్ ఇద్దరిద్దరిని కలిపి ఒక జట్టుగా, రెండు జట్లను చేశాడు. మొదటి జట్టులో టామ్ బర్డిలాన్, ఛార్లెస్ ఇవాన్స్ (టామ్ న్యూక్లియార్ ఫిజిసిస్ట్, ఛార్లెస్ డాక్టరు) ముందుకు కదిలి సౌత్ సమ్మిట్ అనే గుండ్రటి శిలని చేరారు. ఆ తరువాత ఏ మనిషీ వెళ్లలేదు. జీవించలేదు. ఆ జట్టుకి ముందుకు సాగడానికి శక్తి చాలలేదు. వాళ్లు వెనక్కి దిగి వచ్చేశారు.

రెండవ జట్టులో న్యూజిల్యాండ్‌కు చెందిన తేనెటీగల పెంపకందారు ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గే అనే షెర్పా ఉన్నారు. హంట్ ఆదేశాల మేరకు వాళ్లిద్దరూ మొదటి జట్టు భుజాలు తట్టి ప్రయాణం సాగించారు. కష్టపడి 27,900 అడుగులు ఎగబాకారు. అక్కడ, ఒక చిన్న టెంటులో భయంకరమైన రాత్రి గడిపారు.

ఎట్టకేలకు...అత్యున్నత శిఖరం మీద కాలు మోపిన వేళ...

మే 29 సూర్యోదయం ఎవరెస్టుని సువర్ణశోభితం చేసింది. ప్రదేశం నుండి చూస్తే శిఖరం మబ్బులచాటున ఉండి కన్పించడంలేదు. శక్తినంతా కూడదీసుకుని పైకి కదిలారు. ఒక సన్నని మంచుకొన వారిని అడ్డగించింది. అదే మొదటి జట్టునీ అడ్డగించింది. ఒక పక్క 12,000 అడుగుల లోయ. మరో పక్క దూదిలాంటి మంచు. ఎక్కడానికి, పట్టుచిక్కడానికీ వీలులేని

ఎవరెస్టు - కొన్ని విశేషాలు

హిమాలయాలే ప్రాచీనమైన పర్వతాలు. అందులో ఎవరెస్టు దాదాపు 60 మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడింది.

❖ **ఎవరెస్టు ఎత్తు ఎప్పుడూ సందిగ్ధమే. ఇప్పుడు అధికారికంగా అమలులో ఉన్న ఎత్తు 8848 మీటర్లు/ 29, 029 అడుగులు. కానీ నేషనల్ జాగ్రఫిక్ సొసైటీ ప్రకారం దాని ఎత్తు 29,035 అడుగులు. అయితే ఈ ఎత్తు అధికారికం కాదు.**

❖ **ఎవరెస్టుని మొదటిసారిగా కనుగొన్నది జార్జ్ ఎవరెస్ట్ అనే బ్రిటీష్ సర్వేయర్. అతను 1830-43 మధ్యలో సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియాగా పనిచేశాడు. అతని పేరుమీదే 1865లో ఎవరెస్టుకి ఆ పేరు వచ్చింది. అంతకు ముందు దాని పేరు పీక్ XV.**

❖ **భూ భౌతిక చర్యల మూలంగా ఎవరెస్టు ఏటా కొన్ని మిల్లీమీటర్ల ఎత్తు పెరుగుతూంది.**

❖ **1922లో ఏడుగురు షెర్పాలు ఒక మంచు ప్రవాహం ఢీకొని ఎవరెస్ట్ మీద తొలిసారిగా మరణించారు.**

❖ **జుంకో తాబీ అనే జపాన్ మహిళ 16 మే 1975న ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళ.**

❖ **ఆక్సిజన్ లేకుండా మొదటిసారి ఎవరెస్టు ఎక్కింది పీటర్ హేబెలర్ (ఆస్ట్రియా), రైనాల్డ్ మెస్నర్ (ఇటలీ), వీళ్లు 8, మే 1978న దక్షిణ వైపు నుండి ఎక్కారు.**

❖ **1984 మే 23 న బచేంద్రీపాల్ ఎవరెస్టు ఎక్కిన తొలి భారతీయ మహిళగా నమోదైంది.**

❖ **1990, మే 10న హిలరీ కుమారుడు - పీటర్ హిలరీ ఎవరెస్టును అధిరోహించాడు.**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నెలవు

గంగోత్రి, యమునోత్రి, మానస సరోవరం, బద్రీనాథ్ వగైరా స్థలాలు పుణ్య క్షేత్రాలుగా వినుతికెక్కి యాత్రికులతో కిటకిటలాడుతుంటాయి. ఎత్తైన హిమవన్నగాల మధ్య వెడల్పాటి లోయలున్నాయి. ఈ వెడల్పు కొన్ని చోట్ల 320 మీటర్ల వరకూ ఉంటుంది. ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా ఉన్న అనుకూల వాతావరణంలోనే ఈ లోయల్ని దాటడానికి కాలినడకన కనీసం 25-30 రోజులు పడ్తాయి. అంత విశాల, విస్తృత పర్వత శ్రేణులు బహుశా మరెక్కడా లేవేమో!

శిల. ఇటువంటి శిలని మామూలు ఎత్తుల్లో సునాయాసంగా ఎక్కేయవచ్చు. కానీ 29,000 అడుగుల ఎత్తులో, తమ శరీరమే తమకు బరువు అనిపిస్తూ ఉంటే హిలరీ, నార్గే వంటి కాకలు తీరిన వీరులకు కూడా అసాధ్యమే.

కానీ వాళ్లిద్దరూ అసాధ్యం అనుకుంటే ఆగిపోయే రకాలు కారు. కాస్త పరీక్షించి చూస్తే వారికి రెండు నిలువు కొండల మధ్య నిటారు దారి కన్పించింది. దానిని చిమ్నీ అంటారు. కాళ్లు, చేతులు, భుజాల సాయంతో ఒక చిమ్నీలో దూరి పైకి ఎగబాకినట్టు అందులో ఎగబాకారు. ముందు హిలరీ వెనుక నార్గే. ఒక అవరోధాన్ని దాటితే మరొకటి ఎదురవుతోంది. ఇద్దరూ క్రమంగా బలహీనమౌతున్నారు. ఇక వెళ్లలేమేమో అన్న దశలో కనిపించింది ఒక సన్నని అంచు. ఆ అంచు తరువాత ఎక్కడానికి మరే ఎత్తూ కనిపించలేదు.

పోయిన శక్తి తిరిగి వచ్చింది. తాళ్లతో ఒకరినొకరు కట్టుకున్నారు. ఒక్కో అడుగూ వేస్తూ ముందుకు కదిలారు. మరో అడుగు వేయడానికి ముందూ, పైనా ఏమీ లేదు. భూగ్రహపు అత్యంత ఎత్తుకు ఎదిగిన ఎవరెస్టు తలపై మానవుడు కాలుమోపాడు. అపుడు సమయం ఉదయం11:30 శుక్రవారం మే 29, 1953.

మిలటరీ మర్యాదలకి ఆ ఎత్తులో చోటు లేదు. ఆనందానికి అక్కడ ఆకాశం కూడా హద్దు కాదు. నార్గే హిలరీని కౌగిలించుకున్నాడు. మాటామంతీ లేదు. ఎటుచూసినా తెలుపే. వాళ్లద్దరూ పావుగంట పాటు అక్కడున్నారు. తనతో తెచ్చుకున్న శిలువనూ, తినబండారాలనూ బుద్ధుడి కోసం ప్రసాదంగా అక్కడుంచాడు నార్గే. హిలరీ అతన్ని ఫొటోలు తీశాడు. బ్రిటీష్, నేపాల్, భారత్, ఐక్యరాజ్యసమితి జెండాలను అక్కడ పాతి, కిందికి బయలుదేరారు.

నీరసంగా తిరిగివస్తున్న జట్టుని చూసిన, హంట్ వీళ్లు కూడా సాధించలేక పోయారనుకుని మరో జట్టుని పంపాలని నిర్ణయం తీసుకుంటుండగా విజేతలు సంజ్ఞలతో తమ విజయాన్ని చూపెట్టారు. క్యాంపులో ఆనందానికి అవధుల్లేవు. అక్కడినుండి చూడటానికి పైనే ఉన్నా, కార్యసాధకులకు, సాహసికులకు సాగిలపడ్డ ఎవరెస్టు ఇంకా సవాలు విసురుతూనే ఉంది.

ప్రపంచంలో ఎన్నో పర్వతాలున్నాయి. కానీ అన్నిటినీ అధిరోహించడం సులువైన పనికాదు. సులువు కాని పనులను చేయడంలోనే గౌరవమూ, తృప్తీ లభిస్తాయని ప్రతి పర్వతారోహకుడికీ తెలుసు. అటు ఆల్ప్స్ పర్వతాలూ, ఇటు హిమాలయాలు అటువంటి అనుభూతులనే అందిస్తాయి. హిమాలయాలు ప్రపంచంలోకెల్లా ఎత్తైన పర్వత శ్రేణులు కలిగినవి. మన దేశానికి ఉత్తరాన, పడమర నుండి తూర్పుకు 2,400 కిమీ మేర విస్తరించి ఉన్నాయి.

హిమాలయాలు కేవలం పర్వతారోహకులకే కాదు ఇతరత్రా ప్రజలకీ చిరపరిచితమైనవే. ఈ పర్వతాలలో ఉన్న అనేక 'పుణ్య' స్థలాలను దర్శించడానికి యాత్రికులు నానా అవస్థలు పడుతూ అయినా సరే చేరుకుంటారు. ఇది శతాబ్దాల నుండి జరుగుతున్నది.

ఇప్పుడు హిమశిఖరాలను ఎక్కాలంటే విస్తృతమైన శిక్షణ పొందిన వారే సాహసిస్తున్నారు గానీ, అసలు ఈ పర్వతాలను సర్వే చేసిన వాళ్లు ఎటువంటి శిక్షణ లేకుండానే వీటిని ఎక్కుతూ దిగుతూ ఉండేవాళ్లు.

ఈ పర్వతశ్రేణుల సమీపంలోని టిబెట్, నేపాల్ వంటి దేశాలతో మన దేశ వర్తకులకు వ్యాపార సంబంధాలు మెండుగా ఉండేవి. ఆ వ్యాపారులు ఈ కొండలెక్కుతూ దిగుతూ ఉండేవారు. వాళ్లెవరూ నిజమైన పర్వతారోహకులు కాదు. అయినా ఈ మంచుకొండల్లో ఏనాడో తిరుగాడారు.

క్షణక్షణానికి మారే వాతావరణం

ఈ పర్వతాలలో వాతావరణం గంట గంటకూ మారిపోతుంటుంది. సూర్యుడి వేడి చర్మాన్ని కాల్చినట్టుంటుంది. ఉన్నట్టుండి చల్లటి గాలులు వీస్తాయి. అల్ట్రా వయొలెట్ కిరణాలు కళ్ళని మిరిమిట్లు గొల్పిస్తాయి. పెదాలూ, బుగ్గలూ పగులుతాయి. వాతావరణంలోని ప్రాణవాయువు కూడా తరచూ ఇబ్బంది పెడుతుంది. ఈ ఇబ్బందులను ఎదుర్కొని ముందుకెళ్లాలంటే ఎంతో తర్ఫీదుతోపాటు చాలా రకాల పరికరాలు, దుస్తులు అవసరమౌతాయి. కానీ ఈ కొండ ప్రాంతాల్లో నివసించే షెర్పాలు బరువులను మోస్తూ అలవోకగా, వడివడిగా, ఏ ప్రత్యేక సాధనాలు లేకుండానే కదిలిపోతుంటారు. మంచులోనూ, నీళ్లలోనూ వొట్టి కాళ్లతో నడవగలగడం వీళ్లకు సహజంగా ఉన్న ప్రత్యేకత.

సముద్ర మట్టాలకు దగ్గరగా నివసించిన వారు ఈ పర్వతాలకు వస్తే ముందుగా వారికి చలి, వేడితో పాటు ప్రాణవాయువు సమస్య ఎదురౌతుంది. కొంతకాలం వాళ్లు ఇక్కడే నివసిస్తే అలవాటు పడవచ్చు గానీ సమస్య సమస్యే. 14,000 అడుగుల ఎత్తులో ఎన్నో సమస్యలు ఎదురౌతాయి. మెదడు మొద్దుబారుతుంది. చూపు మందగిస్తుంది. నిర్ణయం తీసుకోలేని స్థితి. ఈ సమస్యలు 18,000 అడుగుల ఎత్తు దాటాక షెర్పాలకూ ఎదురౌతుంది. ఓ నాలుగడుగులు వేశాక ఊపిరి తీసుకోడానికే ఆగాల్సి వస్తుంది. రక్తం చిక్కబడి, ప్రసరణ తగ్గుతుంది. గుండె వేగం పెరుగుతుంది. 25,000 అడుగుల ఎత్తులో మిథ్యలు ఎక్కువౌతాయి. నిద్రలో నడుస్తున్నట్టుంటుంది.

ఇవన్నీ అందరికీ తెలుసు. ప్రత్యేకించి పర్వతారోహకులకి. అయినా ఎవ్వరూ వీటికి భయపడింది లేదు. వెనుకడుగు వేసింది లేదు. ఎత్తులకు ఎగబాకాలనే మానవుడి ఆకాంక్షకు ప్రపంచవ్యాప్తంగా పర్వతాలూ తోడౌతున్నాయి. ప్రత్యేకించి ఎవరెస్టు ఎప్పుడూ ఊరిస్తూనే ఉంటుంది.

ఎవరెస్టుపై కాలుమోపిన వారెవ్వరూ తమ సాహసానికి ప్రతిఫలం పొందింది పెద్దగా ఏమీ లేదు. పెను తృప్తి, చిరు గర్వం తప్ప. ❄



ఎవరెస్ట్

ఎవరెస్టు ఎక్కిన తొలి భారతీయ మహిళ బచేంద్రీపాల్





'బయోనిక్ ఐ' అమర్చుకున్న మూర్‌ఫుట్



కృత్రిమ రెటీనా

ఎస్. వెంకట్రావు

కృత్రిమ కళ్లు వచ్చేస్తున్నాయ్!

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. నిజంగానే ఈ చరాచర జగత్తు యొక్క సమాచారాన్ని మన మెదడుకు అందించే ప్రధాన సాధనాలు... చిన్నవైన మన రెండు కనుగుడ్లే. ఆ కనుగుడ్లే లేకపోతే...లేక పనిచేయకపోతే ఈ ప్రపంచమంతా చీకటే. కాని ఇకపై అలాంటి వారు బాధపడక్కరలేదు, ఇతరుల మాదిరిగా కాకపోయినా ఈ ప్రపంచాన్ని కనీస స్థాయిలోనైనా చూడగలరని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పశ్చిమ దేశాల్లో 'బయోనిక్ ఐ' పై జరుగుతున్న పరిశోధనల్లో పురోగతిని బట్టి వారు ఈ విషయాన్ని చెబుతున్నారు.

'బయోనిక్ ఐ' అంటే 'కృత్రిమ కన్ను'. కృత్రిమ కన్ను పరిశోధనలు చాలా కాలం నుండీ జరుగుతున్నా ఇటీవలి కాలంలోనే ప్రాథమిక విజయాలు లభ్యమైనట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా అమెరికాలోనూ, బ్రిటన్‌లోనూ శాస్త్రవేత్తలు ఇటీవల కొంతమంది అంధుల కళ్లకు అమర్చిన "బయోనిక్ ఐ" పనిచేసిన తీరు త్వరలోనే పూర్తి స్థాయి కృత్రిమ కళ్లను తయారుచేయగలరన్న నమ్మకాన్ని కలిగిస్తున్నాయి.

మనం కంటితో చూడ్డం అనేది కేవలం కనుగుడ్డమీదనే ఆధారపడి ఉండదు. మన కనుగుడ్డులో ఉండే కటకం బాహ్యప్రపంచ దృశ్యాన్ని తలకిందులుగా స్వీకరిస్తుంది. ఈ దృశ్యంలోని 'సమాచారాన్ని' దృశ్య నాడి మెదడుకు తీసుకుపోతుంది. మెదడులో 'దృశ్యానికి సంబంధించిన భాగం' ఈ సమాచారాన్ని విశ్లేషించి మనం బాహ్యప్రపంచ దృశ్యాన్ని గ్రహించేట్లు చేస్తుంది. ఈ మూడు భాగాల్లో మొదటి భాగం, అంటే కనుగుడ్డు పనిచేయకపోవడం వల్ల అంధత్వం సంభవించేవారే అత్యధిక మంది ఉంటారు. ముఖ్యంగా 'రెటినిటిస్ పిగ్మెంటోసా' అనే వ్యాధివల్ల కంటిలోని రెటీనా కణాలు క్రమంగా క్షీణించిపోయి పూర్తిగా అంధులవుతారు. నయం చేయడానికి వీలులేని ఈ వ్యాధి ప్రతి 3,500 మందిలో ఒకరికి ఉన్నట్లు అంచనా. ఇటువంటి ఇద్దరు పేషెంట్లకు లండన్ లోని మూర్‌ఫీల్డ్ కంటి ఆసుపత్రిలో 'బయోనిక్ ఐ' అమర్చారు. పూర్తిగా గుడ్డివారైన ఈ ఇద్దరూ కృత్రిమ కళ్లు అమర్చాక ఇతరుల సహాయం లేకుండా తమ పనులు తాము చేసుకోగలుగుతున్నారు. కృత్రిమ కళ్లతో వాళ్లు లోకాన్ని పూర్తిగా చూడలేరు. రంగురంగుల ప్రపంచాన్ని చూడలేరు. కాని వస్తువులను గుర్తు పట్టగలుగుతున్నారు. రోడ్డుమీద నడిచేటప్పుడు ఎదురుగా ఏమైనా అడ్డంకులున్నాయేమో గ్రహించగలరు. అందువల్ల వీరు కర్ర సాయం లేకుండానే దారిచూసుకుని నడవగలుగుతున్నారు. ఇంట్లో కూడా వస్తువులను పూర్తిగా కాకపోయినా చాలా వరకు గుర్తుపడుతున్నారు.

'బయోనిక్ ఐ' అనేది....కళ్లద్దాలకు అమర్చిన వీడియో కెమెరా మినహా మరేమీ కాదు. అయితే ఈ కెమెరా కృత్రిమ రెటీనాకు కలపబడుతుంది. ఈ కృత్రిమ రెటీనాను పేషెంటు కళ్లలో శస్త్ర చికిత్సద్వారా ప్రవేశపెడతారు. ఈ కృత్రిమ రెటీనాకు చేరిన 'కదులుతున్న వీడియో చిత్రాలు' అక్కడి ఎలక్ట్రోడ్‌లను ఉద్దీపన గావిస్తాయి. ఈ ఉద్దీపనలు దృశ్య నాడి ద్వారా మెదడుకు సంకేతాల రూపంలో చేరుతాయి. అక్కడి నుండి కథ మామూలుగానే నడుస్తుంది. దృశ్య నాడి అందించే సంకేతాలను విశ్లేషించుకున్న మెదడు చీకటివెలుగుల చలన చిత్రాలను ప్రాథమిక స్థాయిలో గ్రహిస్తుంది. క్లినికల్ ట్రయల్స్ జయప్రదం అయినాయి గనుక 'కృత్రిమ కళ్లు' త్వరలోనే మార్కెట్‌లోకి అమ్మకానికి రానున్నాయని నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఏడాదికే అవి మార్కెట్లో దర్శనమివ్వవచ్చుని, దాని ఖరీదు కూడా మొదట్లో సుమారు 30,000 డాలర్లు (సుమారు 12.3 లక్షల రూపాయలు) అవుతుందని అమెరికాలోని దక్షిణ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన డొహెనీ ఐ ఇన్‌స్టిట్యూట్, ఆప్తల్మోలజీ విభాగం అధిపతి, బయోమెడికల్ ఇంజినీర్ అయిన ప్రొఫెసర్ మార్క్ హుమయూన్ చెప్పారు. ఈ సంస్థలో ఆరుగురు పేషెంట్లకు 'బయోనిక్ ఐ' అమర్చి పరీక్షలు జరిపారు. 'బయోనిక్ ఐ' సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ సంస్థే రూపొందించింది. "అయిదేళ్లప్పుడు చూసిన నా కొడుకును మళ్లీ ఇన్నాళ్లకు కళ్లారా చూడగలుగుతున్నాను" అని కృత్రిమ కళ్లు అమర్చుకున్న ఒక మహిళ ఆనందంతో చెప్పిందని 'టైమ్స్' పత్రిక రాసింది. "బయోనిక్ ఐ కెమెరా చాలా చాలా చిన్నది. చాలా తక్కువ విద్యుత్తుతో పనిచేస్తుంది. కెమెరా నీ కంటిలోకి వెళ్లి కనుగుడ్డు కదిలే అన్ని వైపులకూ కదులుతుంది. మెదడుకు కావలసిన సమాచారం అందిస్తుంది. బహుశా నాలుగైదు సంవత్సరాల్లో ఈ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందుతుంది" అని ప్రొఫెసర్ హుమయూన్ చెప్పారు. ఈ కంటిని అమర్చుకున్న లిండా మూర్ ఫుట్ అనే ఆమె స్కై న్యూస్ విలేకరితో మాట్లాడుతూ "నా మనవళ్లు ఫుట్‌బాల్, లేక హాకీ ఆడుతుంటే నేను ఆట ఎటువైపు నడుస్తోందో చూడగలుగుతున్నాను. నా మనవడితో బాస్కెట్ బాల్ ఆడితే నేను కూడా బంతిని బాస్కెట్‌లో వేయగలుగుతున్నాను.." అని చెప్పింది.

మూర్‌ఫుట్‌కు అమర్చిన 'బయోనిక్ ఐ'లో 16 ఎలక్ట్రోడ్లు మాత్రమే ఉన్నందున అవి ఉత్పత్తి చేసే ఉద్దీపనలు తక్కువగానే ఉంటాయి. లండన్ సంస్థలో అమర్చిన కృత్రిమ కళ్లకు 60 చొప్పున ఎలక్ట్రోడ్లు ఉన్నాయి. అవి ఇంకా బాగా శక్తివంతమైనవి. ప్రస్తుతం 1,000 ఎలక్ట్రోడ్లు ఉన్న బయోనిక్ కళ్లను కాలిఫోర్నియా సంస్థలో తయారుచేస్తున్నారు. అదే జరిగితే వాటిని అమర్చిన వారు ఇతరుల మొహాలను కూడా పూర్తిగా గుర్తుపట్టేట్లు చూడగలరు.

జరుగుతున్న పరిశోధనలు చూస్తుంటే ఒక్క విషయం మాత్రం స్పష్టమవుతోంది. మరికొద్ది సంవత్సరాల్లోనే శాస్త్రవేత్తలు పూర్తి స్థాయి కృత్రిమ కంటిని తయారు చేయగలరు. అటువంటి కళ్లు తయారై పెద్ద ఎత్తున ఉత్పత్తి జరిగితే వాటి ధర కూడా తగ్గవచ్చు, సామాన్య ప్రజలకు అందుబాటులోకి రావచ్చు. అది కోట్లాది అంధులకు వరం కాక మరేమవుతుంది? అంతే కాదు ఈ టెక్నాలజీని మరింత అభివృద్ధి చేసి ఇతర రకాలైన అంధత్వాలతో బాధపడుతున్న వారికి కూడా ఊరట కలిగించే అవకాశాలున్నాయి. సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్న మానవుని మేధో విజయాల్లో 'బయోనిక్ ఐ' తయారీ మరో విజయంగా నమోదవుతుంది. ❋

వృత్తానికి ముగింపు

మరాఠీ మూలం : ఛాయా దాతర్
తెలుగు : డాక్టర్ దేవరాజు మహారాజు

ఒకరు మాట్లాడుతున్నప్పుడు మిగతా వాళ్లందరూ శ్రద్ధగా వింటూ తలలూపారు. ఎందుకంటే అందరి అనుభవాలు దాదాపు ఒకే రకంగా ఉన్నందుకు! మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. క్లాసు ముగించి అందరినీ భోజనాలకు వెళ్లమని చెబుదామనుకుంటున్నాను. అప్పడొచ్చింది భూరీ బాయి. ఒక బ్యాగు చంకనేసుకుని, చెమటలు కక్కుతూ, హడావిడిగా క్లాసు వెతుక్కుంటూ వచ్చి వెనక కూర్చుంది. ఆమెను చూడగానే కార్యకర్తలు గుసగుసలు చెప్పకున్నారు. 'భూరి బాయి వచ్చింది. భూరిబాయి... భూరి బాయి...'

'క్యాంప్ మొదలై ఓ రోజు అయిపోయింది. నువ్వేమిటీ ఆలస్యంగా వచ్చావూ' అని అడిగాను. అప్పటి దాకా బిగబట్టుకుని ఆపుకుని ఉన్న కన్నీళ్లు ఒక్కసారి కట్టలు తెంచుకుని ప్రవహించాయి. ఆమె ఏదో చెప్పాలని చెప్పలేక ఏడుస్తోంది.

ఎండ తీవ్రత పూర్తిగా తగ్గింది. దినమంతా ఉధృతంగా వీచిన గాలి నెమ్మదించింది. లేచిపడే దుమ్ము, ధూళి సద్దుమణిగింది. నేను తపీనది నీళ్లల్లో మోకాలి లోతున నిలబడి ఉన్నాను. నీళ్లు నా కాళ్ళ చుట్టూ గింగిర్లు తిరిగి వెళ్లి పోతున్నాయి. అంత చల్లటి నీళ్లలో ఉన్నా కూడా నాలో మసిలిపోతున్న ఉక్రోషం, బాధ నా మెదడును వేడెక్కిస్తున్నాయి. సూర్యుడు పశ్చిమాన వాలిపోతున్నాడు. విశాలమైన తపీనది తీరాన ఒంటరిగా నిలబడి, నా సాంఘిక బాంధవ్యాల నుండి విముక్తి పొందుతున్న దానిలా ఊహించుకున్నాను.

దూరంగా డోలు చప్పుడు వినిపించింది. అది క్రమక్రమంగా పెరుగుతూ పోయింది. దానితో పిల్లనగ్రోవి శబ్దం కూడా జత కలిసింది. డోలు శబ్దతరంగాల ప్రకంపనలకు సూర్యుడు త్వరత్వరగా కృంగిపోతున్నట్లున్నాడు. నది అంతటా చీకటి విత్తులతో నిండిపోతున్నట్లుంది. లయబద్ధంగా అడుగుల శబ్దం మంద్ర స్థాయిలో వినిపిస్తోంది. క్యాంప్‌లో జరగబోయే సాంస్కృతిక కార్యకలాపాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. నది నుండి క్యాంప్ దాకా మెల్లగా అడుగులు వేశాను. ఉదయం నుండి మహిళా కార్యకర్తలతో కలిసి తిరుగుతున్నా ఏదో వేదన మనసును తొలచివేస్తూనే ఉంది. దానికి కారణం ఉదయం అందిన ఉత్తరం. వెంటనే బయలుదేరి ముంబాయి రమ్మని మా శ్రీవారి ఆదేశం. ఆయన చెల్లెలి కొడుక్కి అన్నప్రాశన! మా అత్తగారూ, ఇతర బంధువులూ అందరూ వస్తున్నారు. నేను అక్కడ ఉండటం తప్పనిసరి.

మహిళా కార్యకర్తల క్యాంప్ నిర్వహించడానికి వారం రోజుల గడువు అడిగి, అందరినీ ఒప్పించి తను వచ్చి నాలుగు రోజులైనా కాలేదు. మళ్లీ ఇంటి నుండి పిలుపు. కార్యకర్తలందరికీ ఆదర్శప్రాయంగా ఉండాల్సిన తను ఉన్నఫళంగా క్యాంప్ వదిలి, కార్యక్రమాలన్నీ వదిలి, ఇంటికి వెళ్లిపోతే బావుంటుందా? భర్త, అత్తగారు తన వ్యక్తిత్వాన్ని అజమాయిషీ చేస్తున్నట్లుగా వుంది. అమాయకులైన మహిళలందరినీ ఒక్క తాటిపై నడిపించి, వారిని వారి వారి హక్కుల కోసం పోరాడడానికి ఉద్యుక్తుల్ని చేయాల్సిన నా బాధ్యత సంగతేమిటీ?

నది నీళ్లలోంచి బయటికి వచ్చి క్యాంప్‌లోకి నడిచాను. డప్పుల మోత, గజ్జెల చప్పుడు ఉత్తేజకరంగా ఉంది. ఆ రోజు పగలు ఉద్వేగపూరితమైన నా ప్రసంగం మహిళలకు కొత్త స్ఫూర్తినిచ్చినట్లుంది. చీరలు పైకి చెక్కి వేసే అడుగుల్లో బలం కనిపిస్తోంది. లయబద్ధంగా సాగే ఆ నృత్యం నయనానందకరంగా ఉంది. అంతేకాదు పెరిగిన ఆత్మవిశ్వాసానికి సంకేతంగా కూడా ఉంది.

మొట్టమొదటి సారి ఈ ఆదివాసుల గ్రామాల్లో పర్యటించినపుడు ఎంత బాధ కలిగింది! వారి తిండి... వారి పరిసరాలు.. వారి అమాయకత్వం? ఎవరో అన్నట్లు సమాజం ఎంత క్రూరమైందో తెలుసుకోవాలంటే నిజంగా ఆ పల్లెలను, ఆ గూడేలను చూడక తప్పదు. వారి మీద జరుగుతున్న అఘాయిత్యాల గురించి తెలుసుకోక తప్పదు. నీళ్ల పప్పులో భక్రీ (రొట్టె) ముంచుకుని తింటున్న ఆ ఆదివాసీ జనాన్ని చూసి నాకు మొదట దు:ఖం ఆగలేదు. ఆ తర్వాత నేను వారితో కలిసి తినడానికి ప్రయత్నించినపుడు వాంతి ఆగలేదు. ఎంతో కష్టం మీద తినగలిగాను. వారిలో ఆత్మవిశ్వాసం పెంచాలనుకున్నప్పుడు వారిలో పూర్తిగా ఐక్యమవ్వడం తప్పని సరి అయ్యింది. ఒక్కొక్కటిగా వారి సమస్యల్ని తెలుసుకుని పరిష్కారాల కోసం పాటుపడ్డాను. తాలూకా ఆఫీసులు, జిల్లా కార్యాలయాలు నేనెక్కడి కంటే అక్కడికి వారు కదలి వస్తున్నారు. ఒకప్పుడు 'గొర్రెలు' అని భావించబడిన జనం ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. తిరగబడుతున్నారు. హక్కుల

కోసం పోరాడుతున్నారు. అలాంటి ఈ జనాన్ని వదిలి నా భర్త రాసిన ఉత్తరానికి అనుగుణంగా రాత్రికి రాత్రి ప్రయాణమై ముంబయి వెళ్లిపోవాలా? ఏది ప్రధానం? ఏది అప్రధానం?

మానసికంగా, శారీరకంగా చాలా అలసిపోయాను. సాంస్కృతిక కార్యక్రమాలు ఇక ఆపేయండని చెప్పినా కూడా వాళ్లు ఆపేయలేదు. నేను నిద్రలోకి జారుకున్నాను. మరునాడు ఉదయం నేను నిద్ర లేచేసరికి మళ్లీ అందరూ మేల్కొనే ఉన్నారు. వాళ్ల వాళ్ల పనులు ముగించుకుని, డ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ల ఉత్సాహం చూసి నేను సిగ్గుపడాల్సి వచ్చింది. అర్థాంతరంగా వీళ్లందరినీ ఇలా వదిలేసి ముంబాయికి వెళ్లి పోవాలా వద్దా అనేది అంత తేలికగా నిర్ణయించుకోలేక పోయాను. నిస్సహాయంగా ఇక ఆరోజు కార్యక్రమాలవైపు దృష్టి సారించాను.

నా క్లాసు మొదలైంది. వివిధ ప్రాంతాల ఆదివాసీ మహిళలు ఆసక్తిగా వింటున్నారు. నా సుదీర్ఘ ఉపోద్ఘాతం పూర్తవగానే ఒక్కొక్కరినీ వారివారి అనుభవాలు చెప్పమన్నాను. కొంత మంది చంటి పిల్లల్ని ఎత్తుకుని వచ్చారు. కొంత మంది తమ పిల్లల్ని బయట ఆడుకోమని పంపించారు. ఒకరు మాట్లాడుతున్నప్పుడు మిగతా వాళ్లందరూ శ్రద్ధగా వింటూ తలలూపారు. ఎందుకంటే అందరి అనుభవాలు దాదాపు ఒకే రకంగా ఉన్నందుకు! మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. క్లాసు ముగించి అందరినీ భోజనాలకు వెళ్లమని చెబుదామనుకుంటున్నాను. అప్పుడొచ్చింది భూరీ బాయి. ఒక బ్యాగు చంకనేసుకుని, చెమటలు కక్కుతూ, హడావిడిగా క్లాసు వెతుక్కుంటూ వచ్చి వెనక కూర్చుంది. ఆమెను చూడగానే కార్యకర్తలు గుసగుసలు చెప్పుకున్నారు. 'భూరీ బాయి వచ్చింది. భూరీబాయి... భూరీ బాయి...'

'క్యాంప్ మొదలై ఓ రోజు అయిపోయింది. నువ్వేమిటీ ఆలస్యంగా వచ్చావు' అని అడిగాను. అప్పటి దాకా బిగబట్టుకుని ఆపుకుని ఉన్న కన్నీళ్లు ఒక్కసారి కట్టలు తెంచుకుని ప్రవహించాయి. ఆమె ఏదో చెప్పాలని

'ఏం చెబుతున్నావక్కా? యూనియన్ పని పక్కన పెట్టి పెండ్లికి ఉండిపొమ్మంటున్నావా?' అంది తీవ్ర స్వరంతో. అమాయకురాలు, విద్యా విహీనురాలు అయిన ఆ ఆదివాసీ మహిళలో అంతటి ధిక్కారం ఉందని నేనే ఊహించలేదంటే.. ఇక ఇతరులు అసలే ఊహించలేరు.

భూరీ బాయి కాలిన చేతులు ఎన్నింటికో జవాబులు చెబుతున్నాయి. అమెలోని 'అగ్ని' నాకు కూడా శిరోధార్యమే! క్యాంపులో పాల్గొన్న మహిళల ముఖాలన్నీ బాగా పరిచయమయ్యాయి. ఆదివాసీ మహిళల అభ్యున్నతి కోసం నేను ఏర్పాటు చేసిన క్యాంప్ సార్థకమైంది. వృత్తం ముగింపుకొస్తున్నట్లు అనిపించింది. ఆలోచిస్తూ ఆలోచిస్తూ.. ఆ రోజు సాయంత్రం కూడా తపీనది నీళ్ళలోకి దిగాను.

చెప్పలేక ఏడుస్తోంది.

'భూరీ బాయి ఏమిటి? ఏం జరిగింది?' అని అడిగాను. అనునయంగా దగ్గరికి వెళ్లి-ఆమె తన రెండు చేతులూ ముందుకు చాపింది. అవి బాగా కాలి బొబ్బలెక్కి ఉన్నాయి. మోచేతుల నుండి అరచేతుల దాకా మాంసం కాలిపోయి భయంకరంగా ఉంది. అది చూడగానే అందరి గుండెలు ఝల్లుమన్నాయి. ఎవరికీ నోట మాట రాలేదు. కొద్ది సేపటి తర్వాత నేనే మళ్లీ అడిగాను. 'ఏమిటిదీ... ఎలా జరిగింది?'

'ఇవాళ మా మరిది పెళ్లి. కాని ఈ క్యాంప్ ఏర్పాటవుతున్నట్లు, నేను దానికి వెళ్లాల్సి ఉన్నట్టూ మా ఇంట్లో రెండు వారాలుగా చెబుతూ వస్తున్నాను. ఎవరూ పట్టించుకోలేదు. మొన్న క్యాంప్ కోసమని బయలుదేరాను. మా మామ అడ్డుపడ్డాడు. నేను గొడవ చేశాను. ఫలితంగా అతను తన పురుషాహంకారాన్ని ఇలా ప్రదర్శించాడు. ఇది నిన్ననే జరిగింది. రాత్రంగా మంటలు. నరకం చూశాను. మందు లేదు. 'అయ్యో' అనే వాళ్లు లేరు. నాకేదో బుద్ధి చెప్పినట్లు వాళ్లంతా గర్వంగా ఉన్నారు. తెల్లవారు జామున ఎవరూ లేవక ముందే లేచి ఇక్కడికి బయలు దేరాను'.

అందరూ ఆమెను కళ్ళప్పగించి చూడడం తప్ప. ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. 'అవునూ మీ ఊరి నుంచి గంట ప్రయాణమే కదా?' అని అన్నారెవరో.

'బస్సులో వస్తే గంటే-కాని డబ్బులేవీ? ఎవరిస్తారూ? నడుచుకుంటూ వచ్చే సరికి ఈ జామైంది' అంది భూరీబాయి కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

'అయినా ఇంట్లో పెళ్ళి ఉంటే, ఇలా ఎందుకు చేశావ్ భూరీ బాయి?' అని అన్నారు లేని పెద్దరికం అరువు తెచ్చుకుని. ఆ మాట భూరీబాయి భరించలేక పోయింది.

'ఏం చెబుతున్నావక్కా? యూనియన్ పని పక్కన పెట్టి పెండ్లికి ఉండిపొమ్మంటున్నావా?' అంది తీవ్ర స్వరంతో. అమాయకురాలు, విద్యా విహీనురాలు అయిన ఆ ఆదివాసీ మహిళలో అంతటి ధిక్కారం ఉందని నేనే ఊహించలేదంటే.. ఇక ఇతరులు అసలే ఊహించలేరు.

భూరీ బాయి కాలిన చేతులు ఎన్నింటికో జవాబులు చెబుతున్నాయి. అమెలోని 'అగ్ని' నాకు కూడా శిరోధార్యమే! క్యాంపులో పాల్గొన్న మహిళల ముఖాలన్నీ బాగా పరిచయమయ్యాయి. ఆదివాసీ మహిళల అభ్యున్నతి కోసం నేను ఏర్పాటు చేసిన క్యాంప్ సార్థకమైంది. వృత్తం ముగింపుకొస్తున్నట్లు అనిపించింది. ఆలోచిస్తూ ఆలోచిస్తూ.. ఆ రోజు సాయంత్రం కూడా తపీనది నీళ్ళలోకి దిగాను.

నా భర్త రాసిన ఉత్తరాన్ని చించి, చిన్న చిన్న ముక్కలు చేశాను. ప్రవహిస్తున్న నీళ్ళలోకి వాటిని విసిరేశాను. గట్టిగా ఊపిరి పీల్చుకుని నిలబడ్డాను. విశాలమైన ప్రకృతిలో నేను స్థిరచిత్తంతో నిటారుగా నిలబడినట్లనిపించింది...!

❋

ముదురు





ధైర్యే సాహసే లక్ష్మి అంటేనే పాతాళ భైరవి

డా॥ జె.పి. వైద్య

అరుదైన 'సింగిల్ పంచింగ్ లైన్' సంభాషణలతో ప్రజల అఖండ ఆదరాభిమానాలు పొందిన తొలి చిత్రం "పాతాళభైరవి" అంటే అతిశయోక్తి కాదు.
- 'రాకుమారి లభిస్తుంది....'
-'అభీష్టం సిద్ధిస్తుంది...'
-' సాహసం సేయరా డింభకా...!'
- 'భూపాలం పగిలేను'...
'మరి మనకు అడ్డమేమిరా?' అంటే 'మీ గడ్డమే గురూ' అనే సమయోచిత సందర్భోచిత సంభాషణలు 'పాతాళ భైరవి'కి భూషణాలు! నేటికీ 'మోసం గురూ' 'సాహసం సేయరా డింభకా' వంటి పదాలు ఎంతో జనరంజకాలై ప్రజల నాలికల మీద ఆత్మీయ వూత పదాల్లా వుండిపోయాయి.

కంసుడు ఎనిమిదిమంది పసికూనలను చంపే బదులు తెలివిగా వసుదేవుడినీ, దేవకినీ చెరో జైల్లో బంధించి వుండి వుంటే మనకు భాగవతం వుండేది కాదు.. భారతమూ వుండేది కాదేమో బహుశా..! నేడు ప్రతి భారతీయుని గుండెలో భాగవత భారతాలు ఆత్మీయంగా తిష్ట వేసుక్కూర్చున్నాయి కదా!

ఆ 'భాగవత భారతాల' నుండే వందలకొద్దీ పిట్ట కథలూ, గట్టి సినిమాలు పుట్టుకొచ్చాయి. మన తెలుగు సినీ వినీలాకాశంలో 'శ్రీకృష్ణ పరమాత్ముడంటే నందమూరి తారక రామారావుగారు తప్ప ఇంకెవ్వరూ పనికిరారు అనేంత మహాద్భుతంగా 'ఎంటోడు'వారు నటించి, జీవించి, అమరులయ్యారు. జీవితంలో ఫలానావి మంచి అభిప్రాయాలూ, ఫలానావి 'బేకార్ వేస్ట్‌వి' అంటూ వేరు వేరుగా వుండొచ్చేమో కానీ, "ఎన్టీఆర్" వారి "నీలమేఘశ్యాముడు" ఎంత చక్కగా అమరి పోయారంటే, వుంటే గింటే మటుకు 'కృష్ణుడు' ఇలాగే వుండి వుండాలి అని మనం ఇప్పటికీ మనస్ఫూర్తిగా నమ్ముతున్నాం. అయితే, స్వయానా "నందమూరి"గారికైనా, అలనాటి పెద్దోళ్లకైనా "సినీకృష్ణుడు" గురించి అంతగా 'నమ్మకం' వుండేది కాదు. విజయావారి "మాయాబజార్" ఆ 'జాదూ' చేసి చూయించింది. పకడ్బందీ స్క్రిప్టుతో అసలు పాండవులు 'సినిమా తెర' మీద ఎక్కడా లేకున్నా సినిమా నిండా పంచపాండవులు వున్న ఫీలింగ్ కళ్లకు కట్టేలా చేయడం ఆ మహానుభావులకే సాధ్యమైంది.

సినిమా అంతా శశిరేఖా, అభిమన్యుల చుట్టే తిరుగుతూ వుంటుంది. తోడుగా ఘటోత్కచుల వారూ వున్నారనుకోండి. 'వివాహ భోజనం కూడా అదిరిపోయిందన్న విషయం మనం ఇంకా మరచిపోలేదు కదా! ఆ కె.వి. రెడ్డిగారే 1951లో మరో 'గిలిగింతలు' కల్పించే అద్భుత సృష్టి చేశారు.

హిందీలో 'షోలే' డైలాగులు ఒక చరిత్ర సృష్టించాయి.

'అరే! ఓ సాంబా....! కితనే ఆద్మీ రే?' అనే డైలాగుతోపాటు 'హమ్ అంగ్రేజోంకే జమానేకీ జైలర్ హై' లాంటి డైలాగ్ ఎంతో హడావిడి చేస్తూ జన బాహుళ్యంలో కలిసిపోయాయి.

ఆ క్రెడిట్ "గబ్బర్‌సింగ్"దా? సలీం జావెద్ గారిదా? సిప్పిగారిదా? అనే ముచ్చట కాదు నేను తలచుకునేది. ఆ పని మన తెలుగువాళ్లు కూడా ఎప్పుడో చేశారన్న ముచ్చట ఇప్పుడు తలచుకుందాం! రండి!

అరుదైన 'సింగిల్ పంచింగ్ లైన్' సంభాషణలతో ప్రజల అఖండ ఆదరాభిమానాలు పొందిన తొలి చిత్రం "పాతాళభైరవి" అంటే అతిశయోక్తి కాదు.

- 'రాకుమారి లభిస్తుంది....'
-'అభీష్టం సిద్ధిస్తుంది...'
-' సాహసం సేయరా డింభకా...!'
- 'భూపాలం పగిలేను'...

'మరి మనకు అడ్డమేమిరా?' అంటే 'మీ గడ్డమే గురూ' అనే సమయోచిత సందర్భోచిత సంభాషణలు 'పాతాళ భైరవి'కి భూషణాలు! నేటికీ 'మోసం గురూ' 'సాహసం సేయరా డింభకా' వంటి పదాలు ఎంతో జనరంజకాలై ప్రజల నాలికల మీద ఆత్మీయ వూత పదాల్లా వుండిపోయాయి. అంతేకాదు, ఇటీవల విడుదలైన చిత్రాలకు 'టైటిల్స్'గానూ అమరంగా నిలిచిపోయాయి. 'అరేబియన్ నైట్స్' ఆధారంగా పాతాళభైరవి నిర్మాణం జరిగిందన్న వాదనేతో ఎంతమంది ఏకీభవిస్తారో అన్నది ప్రశ్న అయినా... 'ఏం పని అనొసరం లొల్లి తమ్మీ! సీన్మ జబర్దస్త్ వున్నది! చూసినం ! మెచ్చుకున్నం. మరిచిపోయే సవాలే లేదు. గంత యాదికుంచుకోన్ని... చాలూ...! అనేవాళ్లూ జవాబిచ్చి నోరు మూసే ప్రయత్నమూ చేసిన మాట కూడా వాస్తవమే! పాతాళ భైరవి 'భాసియత్' అలాంటిదే మరి!

చిత్ర విచిత్ర మాయాజాలంతో ప్రేక్షకులను కూర్చున్నచోటు నుంచి కదలకుండా చేసిన ముగ్ధ మాయాజాలం "పాతాళ భైరవి". తెలుగు సినిమాను అంతర్జాతీయంగా స్వర్ణయుగంలో పాదాలానేట్టు చేసిన అలనాటి ప్రయత్నం 'పాతాళ భైరవి'. దేశమంతటా విజయావారి విజయ దుందుభి మోగించిన, పండిత పామరుల ఫేవరెట్ శ్వేత శ్యామ వర్ణాల హరివిల్లు 'పాతాళ భైరవి'. ఆంధ్ర, కర్నాటక,

తమిళనాడుల్లోని దాదాపు 28 సినిమాహాళ్లల్లో 'వందరోజుల' పండుగ పర్వాలను కళ్లారా చూసిన అందం 'పాతాళ భైరవి'.

1952లో మొట్టమొదటిసారి మనదేశంలో జరిగిన అంతర్జాతీయ ఫిల్మోత్సవానికి ఎన్నికైన నాలుగు చిత్రాల్లో ఒకటి 'పాతాళభైరవి'. "ఎంటీఆర్ జబర్దస్త్ హై సాబ్! పాతాళ మాంత్రికుణ్ణి చూసి మావోడు 'ఝుట్కా తిన్నట్టు పడ్డడు అన్నా'!, అనే మాములు మనిషి ప్రతిస్పందనతో పాటు "ఎంత ఘాటు ప్రేమయో" , 'ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు' లాంటి 'యాదగార్ పాటలతో పులకరింప చేసిన అలనాటి 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' సీన్లు...మురిపించిన రెమ్మ "పాతాళభైరవి".

1950 ఫిబ్రవరి 5వ తేదీనాడు 'సెట్'లో నిల్చున్న 'పాతాళభైరవి' సరిగ్గా ఒక సంవత్సర కాలం తర్వాత, అంటే 1951 ఫిబ్రవరి 8నాడు పూర్తిగా రూపుదిద్దుకున్నది. చరిత్ర సృష్టించింది. యావత్ ప్రపంచ సినీ రంగంలో సిసిల్ బి.డెమిలేది ఒక ఆదర్శప్రాయమైన గొప్ప వ్యక్తిమత్వం. మన దక్షిణ భారతదేశపు సినీరంగానికి కె.వి.రెడ్డిగారు అంతటి ఘనత సంపాదించడానికి 'పాతాళభైరవి'లాంటి సినిమాలే కారణభూతమయ్యాయి.

వాహినీ సంస్థ తరఫున 1942లో 'భక్తపోతన' , 1947లో 'యోగి వేమన' ఆ తర్వాత 'గుణ సుందరి కథ'ల్లాంటి బాక్సాఫీస్ హిట్ చిత్రాలనందించిన ఘనత 'రెడ్డిగారి'ది. వాహినీ స్టూడియోలో 'పాతాళభైరవి' నిర్మాణం తర్వాతి తరం వాళ్లకు జానపద చిత్ర నిర్మాణ ప్రక్రియకు ఒక మహోన్నతమైన ప్రయోగంలా, ప్రజల అభిమానానురాగాలకు ఒక కొలబద్దగానూ చరిత్రలో నిలిచిపోయింది. కథ టూకీగా యిలా సాగుతుంది.

కథానాయకుడు తోట రాముడు అంటే మన ఎన్టీఆర్ గారన్నమాట.

కథానాయకురాలు రాజకుమారి 'ఇందుమతి'గా మాలతి నటించారు. వారి ప్రేమ ఇతివృత్తం తెలిసిన మిత్రుడు 'అంజి'గా బాలకృష్ణకు ఆ చిత్రం ఎనలేని పేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టింది. జానపదాలంటే కత్తి యుద్ధాలూ, సాహసకార్యాలూ! మధ్యలో దుష్టపాత్రలో 'నేపాళ మాంత్రికుడి'గా ఎస్వీరంగారావు హడావిడి చేస్తూ వచ్చేస్తారు.

స్క్రిప్టు మహా పకడ్బందీగా సాగుతుంది. అదీ కె.వి.రెడ్డిగారి ప్రతాపమే! ప్రతి సన్నివేశాన్ని ముందుగానే ఊహించుకోవడం, మానసికంగా మనస్సులోనే విజువలైజ్ చేస్తూ చిత్రీకరించుకోవడం, ఫిల్మ్ ఎంత వాడుకోవడం లాంటి విషయాలు ఎంత కచ్చితంగా వుండేవీ అంటే, ఆఖర్న ఒక్క అడుగు ఫిల్మ్ కూడా వృథా అయ్యేది కాదు. అడుగడుగునా రెడ్డిగారి ప్రతిభ కళ్లముందు నిలబడుతుంది. "ధైర్యే సాహసే లక్ష్మి" అనే సూక్తితో ప్రారంభం అయ్యే చిత్రం. 'ప్రేమ కోసమై వలలో పడెనే పాపం పసివాడు' పాటతో మనల్ని వుద్వేగంలో పడేస్తుంది. అంజిగాడి సాయంతో హీరో గెలిచేదాకా మనకు టెన్షన్ టెన్షన్. నాయకుడంటే 'ఇలా వుండాలి' అనేలా ఎన్టీఆర్ పాత్రలో జీవించారు. సౌశీల్యానికీ, సౌకుమార్యానికీ ప్రతిరూపంగా నాయిక నిలిచిపోతుంది సినిమాలో. ఇక, మన ఎస్వీరంగారావు గారికి 'నేపాళ మాంత్రికుడి' పాత్ర ఎంతగా ఇమిడిపోయిందో వర్ణించడం కాదు కానీ, ఓపిక చేసి మీరు ఎలాగో, ఎక్కడో, అర్జంట్‌గా 'పాతాళ భైరవి' చూస్తే కానీ అర్థం కాదు. చిత్రం మొత్తానికే ఆయన పాత్ర శరీరానికి ఆధారభూతమైన 'వెన్నెముక'లాంటిది. నభూతో న భవిష్యతి!! తర్వాతి రోజుల్లో ఎన్నో చిరస్మరణీయమైన పాత్రల్లో ఆయన జీవించారు. గుండమ్మ కథ, అప్పు చేసి పప్పు కూడు, నర్తనశాలలో కీచకులవారిగా తెలుగులో 'హిందీ విక్టోరియా ' లోని అద్వితీయ పాత్ర...ఎస్వీ రంగారావు ఒక ప్రత్యేక వ్యాసం... కాదు.. సంపుటి అవుతుంది.

పాతాళ భైరవికి మాటలూ పాటలూ 'పింగళి' గారు చూసుకుంటే, సంగీతం జిమ్మేదారీ 'ఘంటసాల' గారు భుజాన ఎత్తుకున్నారు.

చిటికెడు జానపదం కథ... చరిత్ర సృష్టించిందీ అంటే ప్రారంభం, వ్యాఖ్యానం, చలన చిత్రపు వ్యాకరణం, క్లయిమాక్స్, ఎడిటింగ్, అన్నీ సమపాళ్లల్లో వున్నట్టే! అందుకే 'పాతాళభైరవి' కొత్త సినిమా 'బచ్చాగాళ్లకు' పాఠ్యాంశం లాంటిది! విజయావారి చిత్రాల్లో సంగీతం మహా జోరుగా, హుషారుగా వుంటుంది కదా! ఒకటి కాదు..రెండు కాదు.. మొత్తం తొమ్మిది పాటలు! ప్రేమకోసమై వలలో పడ్డ పాట మనందరికీ 'సదా బహార్' మరపురాని పాట! వేరే పాటలవైపు చెవులు సారిద్దాం...

'ఇతిహాసం విన్నారా' టి.జి.కమల గారి జ్ఞాపకం

'వినవే బాల... నా ప్రేమ గోల' రేలంగోడి స్వంత గొంతు

'వగలోయ్ వగలు' జిక్కి గారి జిమ్మిక్కు.... అన్నీ ఆణిముత్యాలే...!

ఆ రోజుల్లో 'హ్యామండ్ ఆర్గాన్' అనే సంగీత వాద్యం విజయావారి వద్దే వుండేది. దాని జాదూ అమోఘం! జానపద వేషభూషణ, పాతాళభైరవి విగ్రహ కల్పనలో గోఖలే కళా ప్రతిభ అద్వితీయం! కొన్ని సినిమాల వయస్సు ఇంత అని చెప్పనలవి కాని 'తాజా సదా బహార్' చిత్రాల్లా చరిత్ర సృష్టిస్తాయి. మళ్లీ జానపదాలొస్తున్నాయి..కత్తి యుద్ధాలొస్తున్నాయి.. మనం మటుకు తక్కువా?

అలాంటి చిత్రాలను కళ్లు కాయలు కాసేలా చూసి, పండ్లు అయిపోయినా 'పోలో....'మంటూ లేచి 'అరే...! లెవ్వే..! నడూ! కొత్త సీన్మ రిలీజైంది!" అని పరుగెత్తటం లేదా నేటికీ..? ❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622



ఊరి పేరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరు శ్రీదేవి

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

ఏం చెయ్యాలన్నా భయం!

నేను బి.ఎ. చదివాను. ఏం చెయ్యాలన్నా భయం. పరాజయం ఎదురవుతుందేమోననే ఆందోళనతో ఏ పనికీ వెళ్ళలేక పోతున్నాను. నా భవిష్యత్తు అంతా అగమ్యగోచరంగా కనిపిస్తోంది. నా సమస్యకు పరిష్కారం ఉందా?

శేఖర్, హైదరాబాద్.

ఎదురుగా ఉన్న భయంకన్నా ఊహించుకున్న భయం భయంకరంగా ఉంటుంది. మీ భవిష్యత్తు ఖచ్చితంగా మీ చేతుల్లోనే ఉంది. పరాజయమయినా, విజయమయినా మీ ఛాయస్సే. రేపటి మీ జీవితపు సంఘటనలకు మీరు మాత్రమే బాధ్యులు. రేపటి మీ జీవితాన్ని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. మీ కోసం కావాల్సిన వాటిని మీరే సిద్ధం చేసుకోవాలి. ఇది మీ జీవితం. మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకొని, మీకు కావాల్సిన భవిష్యత్తును రూపొందించుకోగల అత్యుత్తమ శిల్పులు మీరే. మీ పరాజయాలకు మీరు కారణం అయినట్లే, మీ విజయానికి కూడా మీరే కారణమవుతారు. మీ బాధ్యతను మీరు విజయవంతంగా నిర్వర్తిస్తే మిమ్మల్ని మీరు ఉన్నత శిఖరాలకు చేర్చుకోగలుగుతారు. మీ జీవితంలోనే ఇది ఒక అత్యుత్తమమైన రోజు. ఈ రోజు చాలా మంచి క్షణం. ఈ క్షణమే మీరు ఏమి చెయ్యాలో ఖచ్చితమైన నిర్ణయం తీసుకొని పని మొదలు పెట్టండి. ఆల్ ది బెస్ట్.

ఎందుకూ పనికిరానట

నేను బి.ఇ.డి. కోసం గత సంవత్సరం ఎంట్రెన్స్ పరీక్ష రాశాను. మంచి ర్యాంకు రాలేదు. అప్పటి నుండి ఇంట్లో అందరూ నన్ను తిడుతున్నారు. నేను ఎందుకూ పనికిరానని అంటున్నారు. ఇప్పుడు మళ్ళీ బి.ఇ.డి ఎంట్రెన్స్ రాయడానికి ప్రిపేర్ అవుతున్నాను. మా ఇంట్లో అందరూ నాకు సీటు రాదని అంటున్నారు. వాళ్ళలా అనడం వల్ల నేను సరిగ్గా చదవలేక పోతున్నాను. భరించడం చాలా కష్టంగా ఉంది. సలహా ఇవ్వగలరు?

అశోక్, కాకినాడ.

మీ ఇంట్లో వాళ్ళు మీ సామర్థ్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తప్పే. వాళ్ళు అలా అంటున్నారని మీ చదువు పాడు చేసుకుంటే వాళ్ళు అన్నదే కరెక్ట్ అవుతుంది. కాబట్టి బి.ఇ.డి. ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకు పొందాలన్న మీ లక్ష్యం మీద దృష్టి పెట్టండి. ప్రతి దానికి బాధపడిపోవటం మిమ్మల్ని జబ్బు మనిషిలా చేస్తుంది. అందుకు విరుద్ధంగా ప్రతి దానిలోనూ ఉత్సాహంగా వుండండి. మీ మనోవైఖరి మీ శారీరక

స్థితిని అదుపు చేస్తుంది. మీ మనోవైఖరిలో లోపాలను గుర్తించి, వాటిని అభివృద్ధి దిశగా మలుచుకోవచ్చు. మీ మైండ్ పవర్‌ను మేల్కొలిపే కార్యక్రమం చేపట్టి చక్కని ప్రయాణం కొనసాగించండి. ఓర్పును కల్గివుండటం, స్నేహపూర్వకంగా మెలగడం, ఉత్సాహంగా నిద్ర లేవటం, అందరినీ అర్థం చేసుకోవటం, ప్రశాంతంగా ఉండటం, ఇంట్లో బాధ్యతగా ఉండటం, ఆసక్తిని పుంజుకోవటం, ప్రతి పనిని ధైర్యంగా చేయుటం, మంచి దుస్తులతో అందంగా చురుకుగా ఆకర్షణీయంగా ఉండడం, టైమ్ ప్రకారం చదవటం చేయండి. వీటిని అలవర్చుకుని చక్కని మనోవైఖరిని సొంతం చేసుకోండి. అది మీ విద్యాభివృద్ధికి, విజ్ఞానాభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి చివరకు విజయ సాధనకు తోడ్పడుతుంది.

ప్రతి దానికి చికాకు...బోర్

నాకు ఏ పని చెయ్యబుద్ధికాదు. దేనిమీదా ఆసక్తి లేదు. ప్రతి దానికి చికాకు, బోర్‌గా ఉంటుంది. ఏది ఎదుర్కొనే శక్తి లేదు. పరిష్కారం చెప్పగలరు?

మాధవ్, నల్గొండ.

ఏం చెయ్యాలో తోచక పోవటం, చికాకు, బోర్ వంటి మనోభావాల మధ్య కొట్టు మిట్టాడే వారిలో రకరకాల మానసిక సమస్యలు కనిపిస్తాయి. ఇది కొన్ని శారీరక సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంది. ఎందుకంటే మన ఒంట్లో ఏ అవయవంలో కణాలైనా అవసరానికి తగినట్లుగా మళ్ళీ మళ్ళీ కొత్తగా పుట్టుకొస్తాయి. కాని మెదడులోని నాడీ కణాలు (న్యూరాన్లు) మాత్రం ఇలా మళ్ళీ మళ్ళీ ఉత్పత్తి కావు.నిత్యం మెదడును చురుగ్గా ఉంచుకుంటేనే ఈ న్యూరాన్లు ఆరోగ్యంగా, పది కాలాల పాటు జీవించి ఉంటాయి. జీవితంలో సవాళ్లను ఎదుర్కొనే శక్తి తగ్గిపోవటాన్ని "పోజిమ్ సింద్రోమ్" అంటారు. స్ట్రెస్‌లాగే దీని వల్ల దుష్ప్రభావాలు ఉంటాయి. ముఖ్యంగా మీరు ఈ సమస్య నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడే ప్రయత్నం చేయండి. మీరు మనసుకు ఉత్తేజాన్నిచ్చే కార్యక్రమాలు ఉండేలా చూసుకోండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం, పజిల్స్ పూర్తి చేయడం, సంగీతం వినటం, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు చదవటం చేయండి. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి.

రుచి



పచ్చిమామిడితో కేసరి

కావలసిన పదార్థాలు

పచ్చిమామిడి కాయ తురుము- నాలుగు కప్పులు
పంచదార- ఒక కప్పు , నెయ్యి- అర కప్పు, యాలకుల పొడి- పావు స్పూన్, మిఠాయి రంగు- (నచ్చినది) పావు స్పూన్

తయారు చేసే విధానం

ముందుగా మామిడి కాయలను కడిగి తుడిచి పై పొట్టు తీసి వేసి కొబ్బరి కోరులా కోరుకోవాలి. ఈ తురుమును గట్టిగా నీరు పోయేలా పిండి ఓ గిన్నెలో వేయాలి. ఇందులో పంచదార కలిపి స్టౌ మీద పెట్టి సన్నటి సెగపై అడుగంటకుండా కలియబెడుతూ ఉడికించాలి. చక్కగా ఉడికిన తరువాత నెయ్యి వేసి దోరగా అయ్యే వరకు వేయించాలి. చివరగా యాలకుల పొడి, రంగు కలిపి దించుకోవాలి. ఇది పుల్ల పుల్లగా, తియ్య తియ్యగా భలే బావుంటుంది. ఇప్పుడు మామిడికాయలు బాగా దొరుకుతాయి కాబట్టి ఇలా చేసుకొని తినవచ్చు.

ఉసిరికాయ హల్వా

కావలసిన పదార్థాలు

ఉసిరికాయలు- నాలుగు కప్పులు
నెయ్యి - ఒక కప్పు
పంచదార - రెండుకప్పులు
యాలకుల పొడి- అరస్పూన్

తయారు చేసే విధానం

ఉసిరి కాయల్ని కడిగి తుడిచి ఆవిరి మీద ప్యాన్‌లో ఉడికించాలి. ఆ తరువాత వాటిలోని గింజలను తీసివేసి మిక్సీ చేసుకోవాలి. ఓ మందపాటి గిన్నెలో ఇందాకటి ముద్దను వేసి పంచదార కలిపి స్టౌ మీద పెట్టి సన్నటి సెగపై అడుగంటకుండా గరిటతో తిప్పుతూ వుండాలి. పంచదార కరిగి ఉడుకుతుండగా నెయ్యి వేస్తూ కలపాలి. బాగా దగ్గరగా అయ్యాక యాలకుల పొడి కలిపి దించి నెయ్యి రాసిన పళ్ళెంలో ఈ మిశ్రమాన్ని వేసి సమంగా సర్దాలి. చల్లారాక ముక్కలు కోసుకోవాలి.



బ్రెడ్ రోస్ట్

కావలసిన పదార్థాలు

బ్రెడ్ స్లైసులు - ఒక ప్యాకెట్ చిన్నది, వెన్న- ఒక కప్పు
మిరియాల పొడి- ఒకస్పూన్, ఉప్పు- తగినంత
కొత్తిమీర తరుగు- అరకప్పు, పుదీనా ఆకులు- అరకప్పు
క్యారెట్ తురుము- కప్పు, ఉల్లి తరుగు- కప్పు, మీగడ - కప్పు

తయారు చేసే విధానం

ముందుగా బ్రెడ్ స్లైస్‌లకు వెన్న రాయాలి. టోస్టర్ వుంటే దానిలో... లేదంటే పెనంపై గానీ బ్రెడ్‌లను ఎర్రగా రోస్ట్ చేసుకోవాలి. తర్వాత పైన చెప్పినవన్నీ మీగడలో వేసి బ్రెడ్ మీద పూయాలి. వాటి పైన కొత్తిమీర, క్యారెట్, ఉల్లి తరుగులను వేసి పుదీనా ఆకులను పరవాలి. ఇలా తింటే చాలా రుచిగా వుంటాయి.

అలచంద సాండెల్

కావలసిన పదార్థాలు

అలచందలు - రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు - రెండు స్పూన్లు
ఉల్లి ముక్కలు- అరకప్పు, కరివేపాకు- రెండు రెబ్బలు, జీలకర్ర- అరస్పూన్, వెల్లుల్లి రేకులు- ఐదారు, ఉప్పు- తగినంత, ఆవాలు- అర స్పూన్, కొత్తిమీర తరుగు- అరకప్పు,పసుపు- చిటికెడు,నూనె-రెండు స్పూన్లు

తయారు చేసే విధానం

అలచందలను నాలుగు గంటల పాటు నీటిలో పోసి నానబెట్టుకుని తీసి కొద్దిగా ఉడికించుకోవాలి. ఆ తరువాత నీరు తీసేసి, ప్యాన్‌లో నూనె వేసి ఆవాలు, జీలకర్ర వేసి వేగనివ్వాలి. కొత్తిమీర తప్ప పైన చెప్పినవి అన్నీ వేసి వేగనివ్వాలి. అలచందలు వేసి ఉప్పు కలిపి మూత పెట్టి సన్నటి సెగపై కాసేపు మగ్గనివ్వాలి. చివరగా కొత్తిమీర చల్లి దించుకోవాలి. పైన పచ్చి టొమేటో, ఉల్లిపాయ ముక్కలు వేసుకొని తింటే రుచిగా వుంటుంది.

- జ్యోతి



ప్రజా ఉద్యమంలోంచి పుట్టుకొచ్చినవే

ప్రజల సామాజిక జీవితంలో మానవ సంబంధాల నిర్మాణంలో జానపద కళారూపాల స్థానం చాలా ప్రముఖమైంది. అవన్నీ సహజసిద్ధమైన భావోద్వేగాల నుండే ఉద్భవించాయి. అందుకే ప్రజల గుండెలను సూటిగా తాకుతాయి. జనం మనస్సులతో మమేకం అవుతాయి. కొంతమంది జీవితాలు జానపద కళలతో ఏకరూపమైపోతాయి. అలాంటి మనస్సులు కలం చేత పడితే భావాలు ఇంకా చిక్కగా పెనవేసుకుని రూపు దిద్దుకుంటాయి. "సత్తెన్న" లో అవన్నీ పుష్కలంగా ఉన్నాయి. సృజనాత్మకత కవితాశక్తిగా మారి అతడిని నిబద్ధత కల్గిన కళాకారుడిగా మార్చడంతోపాటు అంతో ఇంతో ఉద్యమ భావాలున్న మనుషుల్ని కదిలించి పెడతాయి.

ప్రజా జీవితంలోంచి ప్రజా ఉద్యమాలనుండి పుట్టుకొచ్చాయి ఈ కథాగాథలన్నీ... నేటికీ పస తగ్గకుండా నిగ్గుతేలి గళాల్లో గానం చేస్తున్నాయి. జనాలను కదిలిస్తున్నాయి. సమాజాన్ని చైతన్య పరుస్తున్నాయి. అది "భూపోరాటం" కావచ్చు... రైతు బతుకు కావచ్చు... లంచాల ముచ్చట్లు కావచ్చు... ఆడపిల్లల జీవితం కావచ్చు. అంటరానితనం ముచ్చట్లూ కావచ్చు...!

యక్షగానాలూ, ఒగ్గు కథలూ, పల్లెసుద్దుల్లో ఇంకా బలీయమైన శక్తి ఉంది. నింగికెగిసిపోయే ఒళ్లు మంట ఉంది. నేల మీదే పోరాటం సలిపే కార్యదీక్ష కూడా ఉంది.

కళారూపాలు ప్రజాజీవితంలోంచి ఏనాడూ తప్పుకోలేవు. మనస్సులోంచి కాగితంపైకి, కాగితం నుండి సమాజంలోకి దూసుకెళ్లడానికి "జనపథం" అనే 174 పేజీల చక్కటి పుస్తక రూపంలోకి వచ్చాయి. ప్రయత్నం అభినందించదగ్గదే..!

జనపథం (ఒగ్గు కథలు, పల్లెసుద్దులు, యక్షగానాలు) రచన : బండి సత్తెన్న, కూర్పు : ప్రజానాట్యమండలి, పేజీలు :174, వెల : 40 /-,ప్రతులకు : ప్రజానాట్యమండలి - హైద్రాబాద్, ప్రజాశక్తి బుక్ హౌజ్ అన్ని శాఖలు.

జె.పి. వైద్య

తల్లీ నిన్ను దలంచి...

పద్య కావ్యం

నిశాపతి

వెల:60/-, పేజీలు:94

ప్రతులకు:

ప్రజాశక్తి బుక్‌హౌస్,

నవోదయ బుక్‌హౌస్,

విశాలాంధ్ర బుక్‌హౌస్.

చలపాక ప్రకాష్

కార్టూన్లు....

వెల:25/-, పేజీలు:46

ప్రతులకు:

సి. హెచ్. కృష్ణప్రియ,

1-4/3-36,

సంజయ్‌గాంధీకాలనీ,

విద్యాధరపురం,

విజయవాడ.



వర్ధమాన రచయితలు చదవాల్సిన వ్యాసాలు



రచనా ప్రక్రియలు రకరకాలుగా ఉంటాయి.

"నొసటన్ వ్రాసిన వ్రాత కన్న గలదా? నూరేండ్లు చింతించినన్ ?" అని పూర్వం వక్కాణించారు పెద్దలు. కాగితం నొసలు చిట్లించేలా? రాసేవారున్న రోజుల్లో కాగితంతోపాటు 'వొళ్ళు', మనస్సూ పులకరించేలా రాసేవారూ తటస్థ పడ్డారు. డా॥పి.వి. సుబ్బారావు గారి 'ఇరవై' అణి ముత్యాల్లాంటి వ్యాసాలున్నాయి. ఈ 'సాహితీ సౌరభం'లో చదివితే నొసలు చిట్లించకుండా ఆలోచనలు రేకెత్తించే వ్యాసాలివి. కొన్ని అందరికి కొరుకుడు పడకపోవచ్చు. విషయాలు అలాంటివి.

విమర్శనా వ్యాసాల్లో కొన్ని జాగ్రత్తలు చాలా అవసరం. బాగా నలిగి ఉన్న విషయాల మీద రాసేటప్పుడు సరికొత్త సమాచారాన్ని సేకరించడం అనివార్యం అవుతుంది. బాగా తెలిసిన వ్యక్తుల గురించి రాసే సమయంలో 'కొత్త విషయాలు' ఇంకా చదివే ఆసక్తి పెంచుతాయి. అయితే భావజాలంలో నిబద్ధత గురించి కూడా రవంత పునఃపరిశీలన చేసుకునే అవసరం ఉంటుంది. "తుమ్మల వారి కవిత్వం" దగ్గర్నించి శేషేంద్రశర్మ కావ్యం జాతీయ స్థాయినందుకున్న వైనం దాకా.. త్రిపురనేని హేతువాద కవిత్వంలోని

"తలలు గొరిగించి
కావి బట్టలను గట్టి
మెడల రుద్రాక్ష మాల
కలిడినయంత
ముక్తి వచ్చునే..."

భావాల ఒరవడి నుంచి, అనిసెట్టి నాటక శిల్పం దాకా... గద్దె చేమంతుల నుండి జాతీయోద్యమంలోని కవుల పాత్ర దాకా... జాతీయ గోష్ఠిలోనూ, ఆకాశవాణిలోనూ, ఇతరత్రా ప్రచురితమైన వ్యాసాలివి. వర్ధమాన రచయితలు చదవాల్సిన వ్యాసాలు.

సాహితీ సౌరభం (విమర్శ వ్యాస సంపుటి), రచన :డా॥ పి.వి. సుబ్బారావు, వెల : 100/-, పేజీలు : 128, ప్రతులకు : మారుతి పబ్లికేషన్స్, గుంటూరు, విశాలాంధ్ర బుక్ హౌజ్ అన్ని శాఖలు.





బహురూపి బుష్





అప్పుడప్పుడు మనకు తెలియకుండానే చిలిపి ఆలోచనలు వస్తుంటాయ్! మనం ఇంకొంచెం మనసు పెడితే ఆ ఆలోచనల తాలూకు ఆకారాలు కూడా సుస్పష్టంగా గోచరిస్తాయి. ఏంటి! అంతా గ్యాస్ అనుకుంటున్నారా? కాదని నిరూపించొచ్చు. అయితే మేం చెప్పినట్టు చేయాలి.

ముందు మీరు ప్రశాంతంగా ఒక కుర్చీలో కూర్చోండి. మెల్లగా కళ్లు మూసుకోండి. ఇప్పుడు అమెరికన్ అధ్యక్షుడు బుష్‌ని గుర్తుతెచ్చుకోండి. ఆయన రకరకాల రూపాల్లో అంటే...ఓ మోడల్‌లా, కౌ బోయ్‌లా, గిరిజన మహిళలా, సిఇఓలా, అందాల రాణిలా, మహమ్మదీయుడిలా... ఎలా వుంటాడో ఊహించు కోండి. మీ మనస్సులో మెదిలిన ఆకారాలు ఎలా వున్నాయి? సరిగ్గా మీ ముందున్న బొమ్మల్లానే వున్నాయా!

పేరు, ఊరు తెలియని ఓ నెట్టు బ్రహ్మ సృష్టే... బుష్ బహురూపాలు. సరదాగా చేసినా చిలిపిగా బావున్నాయికదూ.







కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : రేగటి భార్గవ్
చదువు: 9వ తరగతి
వయసు: 14 సం॥
స్కూలు : సెయింట్ ఆన్స్ స్కూల్, పాతపట్నం,
లక్ష్యం: ఐఐటి సాధించడం
హాబీలు : పుస్తకాలు చదవడం, క్రికెట్ ఆడడం, కంప్యూటర్ గేమ్స్ ఆడడం
చిరునామా : రేగటి భార్గవ్, సన్నాఫ్: మధుసూధనరావు, పాతపట్నం, శ్రీకాకుళం.

పేరు : బి. రాకేష్
చదువు: 7వ తరగతి
వయసు: 12 సం॥
స్కూలు : శ్రీవాణీ విద్యాల[illegible] యుపిఎస్., నంగునూ[illegible]
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : చదవడం, టీవీ చూడడం, చెస్, క్రికెట్ ఆడటం
చిరునామా : బి. రాకేష్, సన్నాఫ్: యాదగిరి, జౌలపల్లి, మద్దూరు, వరంగల్.

పేరు : అంగిరేకుల వెంకటేశ్వర్లు
చదువు: 8వ తరగతి
వయసు: 13సం॥
స్కూలు : బి.వి. సుబ్బయ్య హై స్కూల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, సినిమాలు చూడటం
చిరునామా : ఎ. వెంకటేశ్వర్లు, సన్నాఫ్: పెద్ద బాల కోటయ్య, తుర్లపాడు, ప్రకాశం.

పేరు : పుల్లూరి రాధిక
చదువు:7వ తరగతి
వయసు: 12సం॥
స్కూలు : ఎ.పి.పి.ఎస్. డబ్ల్యు. ఆర్.ఎస్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: టీవీ చూడటం, పేపర్ చదవడం
చిరునామా : పి. రాధిక, డాటరాఫ్: రాజలింగం తాడ్వాయి, నిజామాబాద్.

పేరు : పుల్లూరి చంద్రవదన్
చదువు : 3వ తరగతి
వయసు: 8 సం॥
స్కూలు : వాగ్దేవి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : కథల పుస్తకాలు చదవడం,
చిరునామా : పి చంద్రవదన్, సన్నాఫ్: నర్సారెడ్డి, తాడ్వాయి, నిజామాబాద్.

పేరు : సింగంపల్లి జయంత్ కుమార్
చదువు: 6వ తరగతి
వయసు: 10సం॥
స్కూలు: మదర్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం స్కూల్
లక్ష్యం: కలెక్టర్ కావడం
హాబీలు: పేపర్ చదవడం, టీవీ చూడడం
చిరునామా : ఎస్. జయంత్ కుమార్, సన్నాఫ్: ఎస్. శ్రీనివాస రావు, చీరాల, ప్రకాశం.